RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 261, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 శనివారం - 21 - డిసెంబర్ - 2024 , వెల రూ.5/-

GK MEDIA

### ఔరంగజేబు వారసులు..
## ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారు: యోగి ఆదిత్యనాథ్

'ఔరంగజేబు వారసులు కోల్‌కతా సమీపంలో నివసిస్తున్నారు



దేవాలయాలు, మతపరమైన ప్రదేశాలపై విధ్వంసక చర్యలకు ఔరంగజేబు పాల్పడ్డాడు . దైవత్వాన్ని ధిక్కరించకపోతే అతడి వారసులు అటువంటి పరిస్థితులను ఎదుర్కొని ఉండకపోవచ్చు'త

### చట్టాలు ఉన్నది భర్తలను బెదిరించడానికి కాదు..
## సుప్రీంకోర్టు మొట్టికాయలు



భార్యకు శాశ్వత భరణం కింద రూ. 12కోట్లను నెలలోకా చెల్లించాలని భర్తకు ఆదేశాలు జారీ చేసింది. అతనిపై నమోదు అయిన క్రిమినల్ కేసులను కొట్టివేసింది

## ఎస్ బీఐ భారీ నోటిఫికేషన్..
## ఏకంగా 13 వేల క్లర్కు పోస్టుల భర్తీ



జనరల్ కేటగిరీలో 5 వేల ఖాళీలు

డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు

ప్రారంభంలోనే రూ.47 వేల వరకు జీతం అందుకునే ఛాన్స్

## సభ్య సమాజం సిగ్గు పడేలా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారు మంత్రి పొంగులేటి



- భూ భారతి బిల్లును ఆమోదించకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటోందన్న పొంగులేటి
- ధరణి పోర్టల్ తప్పుల తడక అనే విషయం కేసీఆర్ కు తెలుసని వ్యాఖ్య
- బీఆర్ఎస్ సభ్యుల చిల్లర వేషాలను ప్రజలు హర్షించరన్న మంత్రి



## అసెంబ్లీలో ఫార్ములా రేస్‌పై చర్చకు బీఆర్ఎస్ పట్టు.. సభను వాయిదా వేసిన స్పీకర్

కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు

అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు

ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశాం

# క్రిమినల్స్ చేతికి 'ధరణి'.. 'భూ భారతి'

## కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ. 600 కోట్లు

- బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం
- ఈ-కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారన్న రేవంత్
- రూ. 600 కోట్ల డబ్బులు రావాల్సి ఉందని చెప్పారన్న సీఎం
- తానను జాగ్రత్త పడటం వల్ల రూ. 450 కోట్లు మిగిలాయని వ్యాఖ్య



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో పలు అంశాలపై వాడీవేడి చర్చలు జరిగాయి. భూ భారతి బిల్లుపై చర్చలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. ధరణి అనేక సమస్యలకు కారణమైందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతులను తమ భూములకు దూరం చేసిందని అన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణితో రాష్ట్ర ప్రజల సమాచారాన్ని దేశం దాటించారని ఆరోపించారు. ఐఎల్ఎఫ్ఎస్ టెరాసిస్ అనే కంపెనీని ఫిలిప్పీన్స్కు చెందిన మరో కంపెనీ కొనుగోలు

మిగతా..2లో

# నేను ఎప్పుడైనా రెడీ..!

## కేసీఆర్, కేటీఆర్‌పై చెలరేగిన సీఎం రేవంత్ రెడ్డి..

అర్హులైన ప్రతీ భూ యజమానుల హక్కులు కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టాం చర్చ జరగడం ద్వారా తెలంగాణ రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావలని భావించాం



హైదరాబాద్: అర్హులైన ప్రతీ భూ యజమానులు హక్కులు కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చర్చ జరగడం ద్వారా తెలంగాణ రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావలని భావించామన్నారు. శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రా రెడ్డి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ

మిగతా..2లో



## మంత్రులకు సీఎం చంద్రబాబు క్లాసు..

- మీ జాతకాలు నా వద్ద ఉన్నాయంటూ హెచ్చరికలు
- మంత్రుల పనితీరు పర్యవేక్షిస్తున్నానన్న సీఎం
- పలువురు మంత్రులు టెక్నాలజీ వాడటం లేదంటూ అసంతృప్తి
- జిల్లా ఇన్‌ఛార్జులుగా ఉన్న మంత్రులు మూడు పార్టీల సమన్వయ బాధ్యతలను తీసుకోవాలన్న చంద్రబాబు

### జగన్ మార్క్ రాజయీయం
# మొదలైనట్టేనా..?

షర్మిల పదవికి చెక్ పడనుందా..?

వైఎస్ జగన్ ఆట ఆరంభం

పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ.. జిల్లాల్లోనే బసచేసేందుకు నిర్ణయం

కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్లను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు



అమరావతి: ఏపీలో అటు కూటమి ప్రభుత్వం ఇటు కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఇరువురూ వైఎస్ జగన్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. మరోవైపు కీలకనేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ ఆట

మిగతా..2లో

## జేపీసీకి జమిలి బిల్లు..
## లోక్‌సభలో తీర్మానం ఆమోదం



న్యూఢిల్లీ: ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై రూపొందిన జమిలి బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని ఇవాళ లోక్‌సభ తీర్మానం పాస్ చేసింది. సభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందు రెండు బిల్లులను జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే రెండు రోజుల క్రితం జమిలి ఎన్నికల బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంటరీ స్థాయి సంఘంలో ఉండే సభ్యుల వివరాలను పంపించాలని రాజ్యసభను మంత్రి కోరారు. సంయుక్త పార్లమెంటరీ స్థాయి సంఘం కమిటీలో మొత్తం 39 మంది ఎంపీలు ఉంటారు. దాంట్లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పీపీ చౌదరీ, ప్రియాంకా గాంధీలు లోక్‌సభ నుంచి ఆ కమిటీలో ఉన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై జేపీసీలో చర్చిస్తారు. ఓ బిల్లు కోసం మాత్రం రాజ్యాంగ సవరణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# స్థానిక పరిస్థితులు చూసి చలించిపోయిన పవన్ కల్యాణ్

- ఇక్కడికి రావాలని ఇప్పటిదాకా ఎవరూ ఆలోచించలేదు
- మన్యం జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన
- గిరిజన గ్రామం బాగుజోలలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- బాగుజోల గ్రామం నుంచి సిరివర వరకు రూ.9.50 కోట్లతో 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డుగా మార్చుతున్నాం
- రుషికొండ ప్యాలెస్ కు రూ.500 కోట్లు ఖర్చు చేశారు కానీ... గిరిజన ప్రాంతం బాగుజోలలో ఒక రోడ్డు వేయలేకపోయారు



అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మన్యం పార్వతీపురం జిల్లాలో పర్యటించారు. మక్కువ మండలంలోని గిరిజన గ్రామం బాగుజోలలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ గిరిజన గ్రామంలోని పరిస్థితులు చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాగుజోల గ్రామం నుంచి సిరివర వరకు రూ.9.50 కోట్లతో 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డుగా మార్చుతున్నామని తెలిపారు. గతంలో తాను పోరాట యాత్రలో భాగంగా పాడేరు, అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రధానంగా మూడు సమస్యలను గుర్తించానని... అవి రోడ్లు, తాగునీరు, యువతకు ఉపాధి అని వివరించారు. ఇక్కడికి రావాలని, ఇక్కడ రోడ్లు వేయాలని

మిగతా..2లో

## ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే మా లక్ష్యం
### గంగూరులో సీఎం చంద్రబాబు



ఉమ్మడి కృష్ణా జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

గంగూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఎప్పుడు ఏ పంట వేస్తే లాభం వస్తుందో రైతులకు వివరిస్తామన్న చంద్రబాబు

## ఔరంగజేబు వారసులు..
# ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారు: యోగి ఆదిత్యనాథ్

లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు వారసులు ప్రస్తుతం ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారని తెలిపారు. ఇది దేవుడు విధించిన న్యాయమని అన్నారు. శుక్రవారం అయోధ్యలోని అసర్ఫీ భవన్ పీఠ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. 'ఔరంగజేబు వారసులు కోల్‌కతా సమీపంలో నివసిస్తున్నారని, ఆటో కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని కొందరు నాకు చెప్పారు. దేవాలయాలు, మతపరమైన ప్రదేశాలపై విధ్వంసక చర్యలకు ఔరంగజేబు పాల్పడ్డాడు. దైవత్వాన్ని ధిక్కరించకపోతే అతడి వారసులు అటువంటి పరిస్థితులను ఎదుర్కొని ఉండకపోవచ్చు' అని అన్నారు. కాగా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలపై యోగి ఆదిత్యనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇది నిదర్శనమని అన్నారు. సనాతన ధర్మం, విలువలను కాపాడాలని సమాజాన్ని ఆయన కోరారు.

## చట్టాలు ఉన్నది భర్తలను బెదిరించడానికి కాదు..
# సుప్రీంకోర్టు మొట్టికాయలు

ఢిల్లీ: మహిళల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాల్లోని కఠినమైన నిబంధనలు వారి భర్తలను శిక్షించడానికి, బెదిరించడానికి లేదా డబ్బు వసూలు చేయడానికి ఉద్దేశించినవి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దంపతుల విడిపోవడానికి సంబంధించిన కేసును విచారిస్తున్న సందర్భంగా జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం ఈ ప్రకటన చేసింది. హిందూ వివాహం అనేది పవిత్రమైన ఆచారమని, అది కుటుంబ పునాదిని బలోపేతం చేయడానికి ఉద్దేశించినదే తప్ప వాణిజ్యపరమైన ఏర్పాటు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. భార్యను క్రూరంగా హింసించారని, వేధింపులకు గురి చేశారని..అత్యాచారం చేశారనే ఆరోపణలన్నింటినీ ప్యాకేజీగా కూర్చి నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ల ప్రకారం భర్త, అతని కుటుంబ సభ్యులపై పెడుతున్నారని ధర్మాసనం తెలిపింది. తీవ్ర మనస్పర్థలతో విడిగా నివసిస్తున్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం పలు వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో భార్యకు శాశ్వత భరణం కింద రూ. 12కోట్లను నెలలోకా చెల్లించాలని భర్తకు ఆదేశాలు జారీ చేసింది. అతనిపై నమోదు అయిన క్రిమినల్ కేసులను కొట్టివేసింది. భార్య తరపున గట్టిగా బేరసారాలు చేసేందుకు భర్త, అతని కుటుంబ సభ్యులపై తీవ్రమైన నేరారోపణలు చేయడం కూడా పరిపాటిగా మారిందని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఈ డిమాండ్లలో అత్యధికంగా ఆర్థికపరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం తెలిపింది. గృహ హింస ఫిర్యాదులతో రంగంలోకి దిగే పోలీసులు కూడా భర్త తరపు బంధువుల్లో వృద్ధులను అనారోగ్యంతో ఉన్నవారిని కూడా అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తున్న ఈ ఘటనలు గొలుసుకట్టు మాదిరిగా ఉంటాయని పేర్కొంది. తన భర్తకు రూ. 5వేల కోట్ల ఆస్తులున్నాయని అతని తొలి భార్యకు రూ. 500కోట్లు భరణంగా ఇచ్చారు. తనకు కూడా అదే స్థాయిలో చెల్లించాలన్న పిటిషనర్ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. ఫ్యామిలీ కోర్టు నిర్ణయించిన రూ. 12కోట్ల భరణాన్ని ఖరారు చేసింది. విడాకులు తీసుకున్న తర్వాత మాజీ భర్తకు వ్యాపారంలో నష్టాలు వచ్చి దివాలా తీస్తే మాజీ భార్య వచ్చి ఆ కష్టాల్లో భాగం పంచుకుంటుందా అని కోర్టు ప్రశ్నించింది.

## ఎస్ బీఐ భారీ నోటిఫికేషన్..
# ఏకంగా 13 వేల క్లర్కు పోస్టుల భర్తీ

ఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బీఐ) భారీ ఉద్యోగ నియామక ప్రకటన విడుదల చేసింది. వివిధ బ్రాంచిలలోని 13 వేల జూనియర్ అసోసియేట్, క్లర్కు ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టింది. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. మొత్తం 13 వేల పోస్టులలో 5 వేలకు పైగా జనరల్ కేటగిరీలోనే ఉండడం విశేషం. ఎంపికైన అభ్యర్థులు ప్రారంభంలోనే రూ.47 వేల వరకు జీతం పొందే అవకాశం ఉంది. ఖాళీలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలు...

పోస్టులు: జూనియర్ అసోసియేట్, క్లర్క్

ఖాళీలు: 13,735 (5,870 జనరల్, 3,001 ఓబీసీ, 2,118 ఎస్సీ, 1,385 ఎస్టీ, 1,361 ఈడబ్ల్యూఎస్), అర్హతలు: ప్రభుత్వ గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఏదేని విభాగంలో డిగ్రీ (ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు), స్థానిక భాషలో మంచి పట్టు ఉండాలి. మాట్లాడటం, చదవడం, రాయడం స్పష్టంగా రావాలి. వయోపరిమితి: 20 నుంచి 28 ఏళ్ల మధ్య (1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1 మధ్య జన్మించిన వారు) రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపులు వర్తిస్తాయి. దరఖాస్తు ప్రక్రియ: ఎస్ బీఐ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి నియామక ప్రక్రియ: తొలి దశలో ఆన్ లైన్ విధానంలో ప్రిలిమినరీ పరీక్ష.. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్ ఎగ్జామ్, అనంతరం లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జీతం: జూనియర్ అసోసియేట్ స్థాయి నుంచి క్లర్కు పొజిషన్ ను బట్టి ప్రారంభ వేతనం రూ.17,900 నుంచి రూ.47,920.

# సభ్య సమాజం సిగ్గు పడేలా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారు మంత్రి పొంగులేటి

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చిస్తుండగా... ఫార్ములా ఈ-రేస్ అంశంపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబడుతున్నారు. స్పీకర్ పోడియంలోకి కూడా బీఆర్ఎస్ సభ్యులు చొచ్చుకుపోయారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగించారు. భూ భారతి బిల్లును ఆమోదించకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటోందని పొంగులేటి మండిపడ్డారు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఆ పార్టీ సభ్యులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ధరణి పోర్టల్ తప్పులతడక అనే విషయం కేసీఆర్ కు కూడా తెలుసని చెప్పారు. కేసీఆర్ 80 వేల పుస్తకాలు చదివారని... పుస్తకాలను క్షుణ్ణంగా చదివి ధరణి పోర్టల్ ను రూపొందించి ఉంటారని తాము భావించామని అన్నారు. మూడేళ్లకే ధరణి పోర్టల్ కు వందేళ్లు నిండాయని చెప్పారు. భూ భారతి బిల్లును సభలో ప్రవేశ పెట్టినప్పుడు కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని భావించామని... కానీ, కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని పొంగులేటి విమర్శించారు. సభలో బీఆర్ఎస్ నేతల చిల్లర వేషాలను ప్రజలు హర్షించరని చెప్పారు.

# అసెంబ్లీలో ఫార్ములా రేస్‌పై చర్చకు బీఆర్ఎస్ పట్టు.. సభను వాయిదా వేసిన స్పీకర్

హైదరాబాద్: కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ నిర్ణయం తీసుకున్నామన్నారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా మేం కూడా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టింది అక్రమ కేసు కాకుంటే ఈ సభలో చర్చించాలన్నారు. తాము తప్పు చేయలేదని.. రాష్ట్రం కోసం చేశామని కేటీఆర్ చెప్పారన్నారు. అక్రమ కేసు పెట్టినప్పుడు కేటీఆర్‌కు చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై నిలదీస్తున్నందుకు, లగచర్ల రైతుల తరపున పోరాటం చేస్తున్నందుకు కేటీఆర్‌పై కేసు పెట్టారని విమర్శించారు. ఈ క్రమంలో సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములా-ఈ రేస్ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. అది ఒక సభ్యుడికి సంబంధించ అంశమని, ముందు బిల్లులపై చర్చిద్దామని స్పీకర్ అన్నారు. అందుకు ఒప్పుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు పట్టుపట్టారు. భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

# మంత్రులకు సీఎం చంద్రబాబు క్లాసు..




అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సున్నితంగా క్లాస్ పీకారు. మంత్రులు ఎవరెవరు ఎలా పని చేస్తున్నారో అందరి జాతకాలు తన వద్ద ఉన్నాయని, ఎప్పటికప్పుడు పనితీరుపై సమీక్షిస్తున్నానని సున్నితంగా హెచ్చరించారు. నిన్న జరిగిన కేబినెట్ భేటీ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. మంత్రులు సచివాలయానికి, క్యాంప్ కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఇన్‌చార్జులుగా ఉన్న జిల్లాల్లో కూడా విస్తృతంగా పర్యటించాలని తెలిపారు. కొందరు దస్త్రాల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారని, టెక్నాలజీ వాడటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరు నెలల పనితీరుపై నివేదిక ఇవ్వాలని కోరితే మంత్రులు రామానాయుడు, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. రాజకీయ సమస్యల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని సూచించారు. ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో మూడు పార్టీల మధ్య సమన్వయం బాధ్యతలను మంత్రులు తీసుకోవాలన్నారు. మంత్రుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడంలో కొందరు వెనుకబడి ఉన్నారన్నారు. విపక్షాల దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పకొట్టాలని సూచించారు. త్వరలో కొణిదెల నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోనున్నారని, ఆ క్రమంలోనే ముగ్గురు లేదా నలుగురిని మంత్రివర్గం నుంచి తొలగించనున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నానని, మీ జాతకాలు తన వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేయడంతో పలువురు మంత్రుల్లో కలకలాన్ని రేపుతోంది. తాజాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# క్రిమినల్స్ చేతికి 'ధరణి'.. 'భూ భారతి'



మొదటి పేజి తరువాయి

కొనుగోలు చేసిందన్నారు. రకరకాల కంపెనీలు ఇందులో వాటాలు తీసుకున్నాయని తెలిపారు. ఒక శాతం వాటా ఉన్న గాదె శ్రీధర్ రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారన్నారు. శ్రీధర్ రాజు.. కేటీఆర్కు అత్యంత సన్నిహితుడని సీఎం రేవంత్ తెలిపారు. ధరణి పోర్టల్ కేసీఆర్ సర్కారు తెచ్చింది కాదన్నారు సీఎం రేవంత్. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐఐసీ, కాగ్ సూచించాయని తెలిపారు. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించిందని సీఎం రేవంత్ తెలిపారు. - క్రిమినల్ కేసులున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుందన్నారు. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారిందని తెలిపారు. 37ఏ ఫాల్కన్ హెచ్చీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, ఆ తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయన్నారు. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారని సీఎం రేవంత్ ఆరోపించారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగిందన్నారు పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా... సీఈవోగా మాత్రం గాదె శ్రీధర్ రాజే ఉన్నారని సీఎం రేవంత్ చెప్పారు. భూ భారతి బిల్లుకు సభ ఆమోదం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం తెలంగాణ అసెంబ్లీ భూ భారతి బిల్లుకు ఆమోదం తెలిపింది. దీంతో ధరణి స్థానంలో భూ భారతి కొనసాగనుంది.

కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ. 600 కోట్లు: రేవంత్ రెడ్డి

ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై శాసనసభలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. స్పీకర్ పోడియంలోకి కూడా దూసుకుపోయారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... అసెంబ్లీలో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై చర్చించాలని ఇంతకాలం కేటీఆర్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఈ-కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారని... రూ. 600 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని... వాటిని ఇవ్వాలని అడిగారని రేవంత్ చెప్పారు. మీరు ఓకే అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారని తెలిపారు. ఎఫ్ఈవో ప్రతినిధులు తనను కలిసిన తర్వాతే తనకు ఈ విషయం తెలిసిందని చెప్పారు. కార్ రేస్ నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ. 600 కోట్ల విలువైనదని రేవంత్ అన్నారు. పెండింగ్ డబ్బుల కోసం నిర్వాహకులు తన వద్దకు వచ్చినప్పుడే ఆ విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. తాను జాగ్రత్త పడటం వల్ల రూ. 450 కోట్లు మిగిలాయని అన్నారు. ఈ విషయంపై ఏసీబీ విచారణ జరుగుతోందని అన్నారు. కేటీఆర్ వేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరుగుతోందని... అందువల్ల తాను ఎక్కువ మాట్లాడడంలేదని చెప్పారు.

# ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే మా లక్ష్యం గంగూరులో సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నేడు పలువురు మంత్రులతో కలిసి ఉమ్మడి కృష్ణా జిల్లాలో పర్యటించారు. గంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. రైతుల ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ సీజన్ లో, ఎలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు వివరిస్తామని అన్నారు. ముఖ్యంగా, పంట చేతికొచ్చాక మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో రైతులకు అవగాహన కలిగిస్తామని చెప్పారు. ధాన్యానికి సంబంధించి తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండడం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోనె సంచుల పంపిణీలో రైస్ మిల్లులు పొరపాట్లు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, 5 కోట్ల గోనె సంచులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీల్లో డ్రైయర్లు ఏర్పాటు చేశామని, తేమ ఎక్కువగా ఉన్న చోట్ల డ్రైయర్లు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. 1,713 రైస్ మిల్లులకు గాను 394 మిల్లుల్లో మాత్రమే డ్రైయర్లు ఉన్నాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుకు అవకాశం ఉండాలని భావిస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ యంత్రాలు వచ్చాక రైతులు సంతోషంగా ఉన్నారని, ఎక్కువ దిగుబడికి కారణాలేంటి అనే అంశాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. గతేడాది కంటే ఈ ఏడాది, ఈ సమయానికి 40 శాతం ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే 3.20 లక్షల మంది రైతుల నుంచి 21.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 48 గంటల కంటే ముందే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

# నేను ఎప్పుడైనా రెడీ..!



మొదటి పేజి తరువాయి

భీం రెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ లాంటి వారు పోరాటాలు చేసింది భూమి కోసమేనని అన్నారు. ఈ భూమినే తమ హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారని గుర్తు చేశారు. అధికారంతో, అహంకారంతో ఆధిపత్యాన్ని చెలాయించాలని చూసినా భూమిని కాపాడుకోవడంలో వారు విజయం సాధించారని అన్నారు. "యజమాని హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి. భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ గారు పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. నిజమైన భూ యజమాని హక్కులను కాపాడాలి. లేకపోతే చదువులేని వారి భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వీలైనంత మేరకు ప్రజలకు ఉపయోగపడేలా చట్టాలు సవరించాయి. తన మెదడును రంగరించి మాజీ సీఎం కేసీఆర్ ఒక అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని ఆనాడు సభలో చెప్పారు. ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా కనిపెట్టింది కాదు. 2010లోనే ఒడిస్సాలో ఈ-ధరణి పేరుతో IL&FS కంపెనీకి అప్పగించింది. అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు ఈ-ధరణి పోర్టల్ ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టింది. అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ ఎందుకు తెలంగాణ ప్రజలపై రుద్దారో చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. 2018లో IL&FS తో పాటు గాదె శ్రీధర్‌కు చెందిన e centric, wissen infotech సంయుక్తంగా కాంట్రాక్టు సాధించుకున్నాయి. క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉంది.. కానీ కేసీఆర్ ఆ పని చేయలేదు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారు. ఆ తరువాత IL&FS సబ్సిడరీ కంపెనీ అయిన టెరాసిస్ ధరణి కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ టెర్రాసిస్‌లో 99 శాతం షేర్లు ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన Falcon SG అనే సంస్థ రెండు దఫాలుగా 2021 లో కొనుగోలు చేసింది. మిగిలిన ఒక్క శాతం వాటా మాత్రం కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్ రాజు కొనుగోలు చేశారు. ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్‌కు సీఈవోగా అవతారం ఎత్తారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్, భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టారు. ఇతర దేశాల్లో ఆర్థిక నేరాల్లో ఇరుక్కుపోయిన సంస్థలకు అప్పగించి.. రైతుల సంపూర్ణ డేటాను వాళ్ల చేతుల్లో పెట్టారు. ఇది ఎంత తీవ్రమైన నేరమో ఒక్కసారి ఆలోచించాలి. ప్రజలకు ద్రోహం చేసి, మోసం చేసి సంపూర్ణ సమాచారాన్ని విదేశీ కంపెనీలకు అప్పగించారంటే.. దీనిపై ఎలాంటి విచారణ చేయాలో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. ఎంసీహెచ్‌ఆర్డీలో అద్భుతమైన సాంకేతిక ఉంది..ఇతర రాష్ట్రాలకు మన సాంకేతికతను అందిస్తున్న పరిస్థితుల్లో వీళ్లు విదేశీ కంపెనీలకు అప్పగించారు. కేసీఆర్ ఆవేశంతో ఊగిపోతుంటే ఆనాడు నాకు అర్థం కాలేదు. ధరణిలో ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రయివేట్ భూముల యజమానుల పేర్లు మారాయి. అగ్రిమెంట్ లోని 9.20 క్లాజ్ ప్రకారం యజమాని పేరు మార్చడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. 9.20.4 క్లాజ్ లో పేర్కొన్నట్లు ప్రభుత్వ ఆఫీసులో ఉండి పనులు చేయాలి. రెవెన్యూ శాఖకు సంబంధించిన సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పని చేయాలి. తెలంగాణలో కాకుండా విజయవాడలో, బెంగుళూరుకు, ఈశాన్య రాష్ట్రాల నుంచి ధరణిని నిర్వహించారు. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో లేని కంపెనీలకు, విదేశీయులకు అప్పగించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. దీనిపై ఎంత కఠినమైన శిక్ష వేయాల్సిన అవసరం ఉందో ఆలోచన చేయాలి. గోప్యంగా ఉంచాల్సిన సమాచారం ఆ వ్యక్తికి తెలియకుండా ఎవరికీ ఇవ్వొద్దని చట్టాలు చెబుతున్నాయి. కానీ కేసీఆర్, కేటీఆర్ ఇతర దేశాల వ్యక్తులకు ఈ సమాచారం అప్పగించారు. ఇంత ఎంత తీవ్రమైన నేరం..? ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లేందుకు చాలా సమావేశాలు నిర్వహించి భూ భారతి చట్టాన్ని సభ ముందుకు తీసుకొచ్చింది. ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్లు అర్ధరాత్రి కూడా జరిగాయి. అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు చేసే వ్యవస్థ ఏ రాష్ట్రంలోనైనా ఉందా..? బండారం బయటపడుతుందనే ఇవాళ చర్చ జరగకుండా ప్రయత్నాలు చేశారు.

# స్థానిక పరిస్థితులు చూసి చలించిపోయిన పవన్ కల్యాణ్

డ

రోడ్లు వేయాలని ఇప్పటిదాకా ఎవరూ ఆలోచించలేదని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం 2020-22 మధ్య వెనుకబడిన జిల్లాల కోసం రూ.670 కోట్లు ఇచ్చింది. ఆ నిధులు వస్తే, గత ప్రభుత్వం హయాంలో లెక్కా పత్రం లేకుండా చేశారు. తనకు అన్యాయం జరిగిందని చెప్పిన బిడ్డ మీ దగ్గర ఓట్లు వేయించుకున్నారు కానీ... గత ఐదేళ్ల పాలనలో మీకు రోడ్డు వేయలేకపోయారు. రుషికొండ ప్యాలెస్ కు రూ.500 కోట్లు ఖర్చు చేశారు కానీ... గిరిజన ప్రాంతం బాగుజోలలో ఒక రోడ్డు వేయలేకపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని ఒకటే అడిగాను... 70 ఏళ్లుగా ఇక్కడ రోడ్లు లేవు, బాలింతలను డోలీల్లో మోసుకెళ్లే పరిస్థితి ఉందని ఆయనకు వివరించాను. చంద్రబాబు గారి ఆధ్వర్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం తరఫున మీ అందరికీ మాటిస్తున్నాను... మీకోసం ఎండనకా, వాననకా అహర్నిశలు కష్టపడడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## జగన్ మార్క్ రాజయీాయం
# మొదలైనట్టేనా..?

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో వైఎస్ జగన్ ఆట ఆరంభించినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నేతలపై గురి పెట్టారు. ఏపీలో అధికారం కోల్పోయిన తరువాత వైఎస్ జగన్ దిద్దుబాటు చర్యలు మొదలెట్టారు. అటు ప్రభుత్వంపై పోరుబాట చేస్తూనే పార్టీపరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ.. జిల్లాల్లోనే బసచేసేందుకు నిర్ణయించారు. పార్టీ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ తనపై విమర్శలు ఎక్కు పెడుతున్న చెల్లెలు వైఎస్ షర్మిలను టార్గెట్ చేశారు. షర్మిల పదవికి చెక్ పెట్టేలా ఢిల్లీ నుంచి ఆట మొదలెట్టారని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్లను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. తండ్రి వైఎస్తో పనిచేసి ప్రస్తుతం పార్టీలో కొనసాగలేని నేతలతో మాట్లాడుతున్నారు.ఇందులో భాగంగానే మాజీ పీసీసీ చీఫ్ శైలజానాథ్ సమావేశమయ్యారు. ఈయనతో సహా 8 మంది సీనియర్ నేతలు వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు సమాచారం.

### వైఎస్ షర్మిల టార్గెట్..

పీసీసీ చీఫ్ గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి వైఎస్ షర్మిల ప్రతి సందర్భంలోనూ అధికార పార్టీ కంటే ప్రతిపక్షం జగన్నైనే విమర్శలు ఎక్కువగా చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేయకుండా జగన్పై విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. షర్మిల నాయకత్వంలో పనిచేయలేమంటూ కొందరు సీనియర్లు గళం విప్పారు. ఈ అంశాల్ని తనకు అనుకూలంగా మల్చుకునేందుకు వైఎస్ జగన్ కసరత్తు ప్రారంభించారు. ఢిల్లీ కేంద్రంగా పావులు కదుపుతున్నారు. షర్మిల పదవికి చెక్ పెట్టేందుకు తన మార్క్ రాజకీయం మొదలెట్టారు.

## ఇలా చేస్తే చాలు.. శీతాకాలంలో
# విటమిన్-డీ పుష్కలంగా లభ్యం

**రోజుకు రెండు గుడ్లు తింటే శరీరానికి అందనున్న విటమిన్-డీ**

**శీతాకాలంలో ఎముకల నొప్పులకు కూడా చెక్**

**జుట్టు రాలడం, చర్మ సమస్యలను కూడా నివారించవచ్చంటున్న వైద్య నిపుణులు**



శీతాకాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవడం సహజం. అయితే, ఈ అత్యల్ప ఉష్ణోగ్రతల పరిస్థితులు అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంటాయి. శరీరంలో అంతర్గతంగా అవసరమైన ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం, రక్త ప్రసరణ మందగించడం, ఎముకల నొప్పులు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే, ఆహారంలో చిన్నపాటి మార్పు చేసుకుంటే చాలా సమస్యలను అధిగమించవచ్చు. చలికాలంలో ప్రతిరోజూ 2 గుడ్లు తింటే చక్కటి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గుడ్లలో అధిక ప్రోటీన్లు, ఒమేగా-3తో పాటు కొన్ని విటమిన్లు లభిస్తాయని, ఇవి శీతాకాలంలో వచ్చే అనేక సమస్యలను దూరం చేస్తాయని సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా గుడ్ల ద్వారా పుష్కలంగా లభించే విటమిన్-డీ ఎముకలు, మెదడు కణాల పనితీరును మెరుగుపరచడంలో చక్కగా ఉపయోగపడుతుంది. మనం తినే గుడ్లు శరీరంలో కొలెస్ట్రాల్‌గా మారి నిల్వ అవుతాయి. దాని నుంచి శరీరం విటమిన్-డీని ఉత్పత్తి చేసుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గుదలకు కూడా గుడ్లు బాగా ఉపయోగపడతాయి. అధిక ప్రోటీన్ల కారణంగా కడుపు నిండుగా ఉంటుంది. ఫలితంగా తీసుకునే ఆహారం తగ్గుతుందని అంటున్నారు. హార్మోన్ల పనితీరును కూడా సమతుల్యం చేస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుదలలో గుడ్లు బాగా దోహదపడతాయని వైద్యులు సలహా ఇస్తున్నారు. గుడ్లలో పుష్కలంగా లభించే విటమిన్-డీ, జింక్ పదార్థాలు ఎముకలు గట్టిపడడానికి ఉపయోగపడతాయి. కాబట్టి, రోజు రెండు గుడ్లు తింటే చలికాలంలో కీళ్ల నొప్పుల వంటి ఎముకల సమస్యలను నివారిస్తుందని చెబుతున్నారు. ఇక, గుడ్లలో లభించే విటమిన్-బీ జుట్టు రాలే సమస్యను కూడా తగ్గిస్తుంది. చర్మం, గోళ్ల ఆరోగ్యానికి కూడా విటమిన్-బీ ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

## దేవాలయం బాట కోసం బాధ్యతలు నిరసన

**తాసిల్దార్ కార్యాలయం ఎదుట బాట కావాలి బాట కావాలి అని నిరసన వ్యక్తం చేశారు**



**(నేటి శుభోదయ):** 20 డిసెంబర్ గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజవర్గం పెదనందిపాడు మండలంలో స్థానిక తాసిల్దార్ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు వీర లంకమ్మ గుడి బాటుకు అడ్డుపెడుతున్నారని స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు .. గుడి కమిటీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఈ దేవాలయం ఇక్కడ ఉందని దానికి బాటుకు వేరే వాళు ్ళ అడ్డుపెడుతున్నారని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు వెంటనే మా సమస్య గుంటూరు జిల్లా పరిష్కరించి మా కుల దేవత అయిన వీర్లంకమ్మ గుడికి బాట ఇవ్వవలసిందిగా కమిటీ సభ్యులు గ్రామ సదస్సులో వినతి పత్రం అందజేశారు....

## కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో డిఎస్పి ఇన్స్పెక్షన్



**(నేటి శుభోదయ):** 20 డిసెంబర్ పల్నాడు జిల్లా కారంపూడి: కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో గురువారం గురజాల డీఎస్పీ జగదీష్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. అనంతరం డీస్పీ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సాధారణ తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి జగదీష్ మాట్లాడుతూ ప్రజలతో పోలీసు సిబ్బంది కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండలన్నారు. ఈ కార్యక్రమం లో కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ టీ.వీ . శ్రీనివాసరావు , కారంపూడి ఎస్సై టీ. వాసు, రెంటచింత ఎస్సై టీహెచ్. నాగార్జున కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ సిబ్బంది, కారంపూడి పోలీస్ సిబ్బంది తదితరులు పాలుగోన్నారు.

## నీటి సంఘం ఎన్నికల్లో నూతనంగా ఎన్నుకోబడ్డ డీసీ చైర్మన్లలను వినుకొండ




**(నేటి శుభోదయ):** 20 డిసెంబర్ పల్నాడు జిల్లా వినుకొండ : నియోజకవర్గ జనసేన పార్టీ





సమన్వయకర్త శ్రీ కొంజేటి నాగ శ్రీను రాయల్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ లిడీసీ చైర్మన్లు రావుల బుజ్జి, ముత్తినేని ఏడుకొండలు, నక్క బుల్లేశ్వర్ రెడ్డినీ శాల్వాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో నూజెండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మీసాల మురళి, ముంద్రు సుబ్బారావు జనసేన పార్టీ నూజెండ్ల మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి రజబాబుసింగంశెట్టి శ్రీరామ్ మూర్తి,మాజీ ఎంపిటిసి తోక శీను , అప్పిశెట్టి సునీల్,రావుల శేషగిరి, పగడాల అజయ్, తుంగ సాయి, అప్పిశెట్టి కార్తీక్, లింగం గణేష్, వేముల వీరంజి,రావుల అనిల్ మరియు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా “మందా సైదులు” ఎన్నిక



రాథోడ్ ( నేటి శుభోదయ )మధిర, డిసెంబర్ 20 :- సత్తుపల్లి పట్టణంలో జరిగిన సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా 22వ మహాసభలో మధిర సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న మందా సైదులు ను పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ లో రాష్ట్ర కమిటీ సభ్యునిగా జిల్లా కేంద్రంలో బాధ్యతలు నిర్వర్తించి పార్టీ అవసరాల రీత్యా మధిర మండలంలో వ్యవసాయ కార్మికుల సమస్యల పైన యువకుల విద్యార్థుల సమస్యల పైన రైతుల సమస్యల పైన పలు కార్యక్రమాలు నిర్వహించి పార్టీ విస్తరణ కోసం కృషి చేయడం. విద్యా అర్హతలు బీఎస్సీ ఎల్ఎల్బి చదివి పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా ప్రజలకు అందుబాటులో ఉండి చురుగ్గా పనిచేయడం వల్ల గతంలో మధిర మండల కార్యదర్శులుగా పనిచేసిన వారు ఎవరికి జిల్లా కమిటీ అవకాశం రాలేదు ప్రస్తుతం పనిచేస్తున్న మందా సైదులు జిల్లా కమిటీకి ఎన్నిక కావడం పట్ల పార్టీ మధుర మండల కమిటీ శ్రేణులు సంతోషాన్ని వ్యక్తపరిచాయి. మధిర మండలంలో పార్టీని మరింత ముందుకు తీసుకోవడం కోసం తమవంతు కృషి చేస్తానని పెద్దలు ప్రజలు సాయం సహకారాలు అందించాలని సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

## కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**కాంగ్రెస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం**



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -20 ( నేటి శుభోదయ): పార్లమెంటులో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించేవిధంగా ప్రసంగించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంథని కాంగ్రెస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశ శాంతి భద్రతులకు విఘాతం కలిగించే విధంగా ప్రసంగించినందుకు వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మంథని మండల అధ్యక్షుడు మంథని రాకేష్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు నాగేల్లి జానీ, ఎస్సీ సెల్ నాయకులు కాసిపేట బాపు, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి అక్కపాక సదయ్య, నాయకులు రోడ్డ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్ కమిటీ చైర్మన్ రేసులో ముందంజలో పంగులూరి అంజయ్య



**(నేటి శుభోదయ):** 20 డిసెంబర్ పల్నాడు జిల్లా కారంపూడి : నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్ కమిటీ చైర్మన్ రేసులో మాచర్ల టీడీపీ నేత పంగులూరు అంజయ్య ముందంజలో ఉన్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తూ నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలిచి పార్టీని నియోజకవర్గంలో గెలిపించడంలో అంజయ్య పాత్ర మరువలేనిది.2004 నుంచి 2014 వరకు పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు 10 సంవత్సరాలు కారంపూడి మండల పార్టీ అధ్యక్షుడు గా మండలంలో పార్టీ నీ నడిపించడమే కాకుండా నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు గా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఘనత అంజయ్య ది.2014 పార్టీ అధికారంలో వున్నప్పుడు నాటి టీడీపీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ను ప్రజలకు అందించడంలో అంజయ్య విశేష కృషి చేసిన విషయం నియోజకవర్గం లో అందరికీ తెలిసిందే.2019 లో పార్టీ అధికారం కొల్పోయాక మాచర్ల నియోజకవర్గాల్లో టీడీపీ జెండా పట్టుకోవడానికి కూడా భయపడ్డ రోజుల్లో 5 మండలాల పరిధిలోని నాయకులు కార్యకర్తలను కలుపుకొని అధినేత నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి నియోజకవర్గ పరిస్థితులను తెలియచేసి బ్రహ్మానందరెడ్డి గారి నాయకత్వములో పార్టీ నీ ముందుకు నడిపించిన వ్యక్తి అంజయ్య.నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కో ఆర్డినేటర్ గా 2024 ఎన్నికల్లో అన్ని బూత్ లలో టీడీపీ మెజారిటీ సాధించడంలో కూడా అంజయ్య తీవ్ర కృషి చేశారు.బ్రహ్మానందరెడ్డి గారి వెన్నంటి ఉండి అందరినీ సమన్వయ పరిచి చరిత్రలో ఎరుగని భారీ మెజారిటీ తో బ్రహ్మానందరెడ్డి గారి గెలుపు లో కీలకపాత్ర పోషించిన అంజయ్యకు సముచిత స్థానం కల్పించాలని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల టీడీపీ నేతలు,కార్యకర్తలు కోరుకుంటున్నారు.ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు,జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి,గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గారి ఆశీస్సులు మెండుగా ఉన్న అంజయ్య కు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్ కమిటీ చైర్మన్ పదవి దక్కడం దాదాపు ఖాయమేనని నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి హెూమ్ మంత్రి అమీషా క్షమాపణ చెప్పాలి

**విస్సన్నపేట బహుజన ఐక్యవేదిక**



విస్సన్నపేట:నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్): విస్సన్నపేట అంబేద్కర్ సర్కిల్ నందు దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కేంద్ర హెూం శాఖమంత్రి అమిత్ షా నిండు సభలో పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ నీ అవహేళనగా మా దేవుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై చేసి వ్యాఖ్యలను, అవమాన పరిచిన మాటలను వెనక్కి తీసుకొని అదే నిండు సభలో క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు,ప్రజా సంఘాలు పెద్ద యెత్తున ఆందోళనకు దిగాయి,ఈ సందర్భంగా ఆ మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి ఈ రోజు పాలాభిషేకం చేసి పూలమాలతో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘన సత్కారం చేయటం జరిగింది,అనంతరం



పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై పవిత్రంగా దేవాలయంగా భావించే పార్లమెంటు సాక్షిగా అవహేళన చేసి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది,ఈ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఈ పెద్దమనిషి అమీషా అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు తీసుకున్న సంగతి మరచిపోవడం సిగ్గు చేటు అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి కూడా ఇదే రాజ్యాంగం ద్వారానే ప్రధాని అవటానికి అవకాశం కల్పించింది రాజ్యాంగం ద్వారానే అని విషయాలను మరచిపోతే త్వరలోనే మీకు రాజ్యాంగం యొక్క శక్తి ఏమిటో తెలియచేస్తాం అని,రాజ్యాంగం ద్వారా నియమించబడ్డ వ్యక్తులు మీరు దాన్ని మరచిపోవద్దు అని హెచ్చరించారు, భారతదేశానికి మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అలాంటి వ్యక్తిని మీరు అవమాన పరుస్తారా,మీకు అంత కండ కావరం ఏమిటి అని సూటి ప్రశ్నలతో ముక్త కంఠంతో ప్రశ్నల వర్షం కురిపించారు వక్తలు,ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ భారతదేశ మొత్తం మీరు మాట్లాడింది తప్పు అని ప్రజలు అంటున్నారనీ,మీకు ఇది తప్పు అనిపించడం లేదా రాజ్యాంగ ప్రదాత నే చులకనగా మాట్లాగే స్థాయికి చేరిన మీకు మీ పార్టీ కి త్వరలోనే చెరమ గీతం పాడేందుకు ప్రజలందరూ చూస్తున్నారని తెలుపుతూ, పదిసార్లు అంబేద్కర్ స్మరించే బదులు ఏదైనా దేవుడిని స్మరిస్తే పుణ్యం ఉంటుంది అన్న మీరు ఎలాంటి ఆలోచతో అన్నారో అర్థం అవుతుందనీ, మా దేవుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై ఎవడు తక్కుగా మాట్లాడిన ఉపేక్షించేది లేదని,మాకు బ్రతుకులను ఇచ్చింది అంబేత్కర్ అని, ఎలా బ్రతకాలో దారి చూపించింది ఒకే ఒక్క మహెూన్నత వ్యక్తి ఆయనే మా అంబేత్కర్ అని రాజ్యాంగం ద్వారా చేసి చూపించాడని తెలిపారు, ప్రతి ఒక్క భారతీయుడు అంబేద్కర్ మాత్రమే దేవుడు అని పూజించుకోవాలని అలాంటి మా దేవుడు అంబేద్కర్ పేరును ఒక్కసారి కాదు వెయ్యి సార్లు అంటాం మా దేవుడు అంబేద్కర్ దాన్ని వక్రీకరించి నువ్వు మాట్లాడిన తీరు సిగ్గుచేటు నీకు కేంద్ర హెూమ్ మంత్రి గా ఉండే అర్హత లేదని క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చెయ్యాలని ఈ విధంగా అవహేళన చేయటం మేము ఖండిస్తున్నామని బిజెపి అమీషా నువ్వు బహిరంగంగా క్షమాపణ చెప్పాలనీ పాల్గొన్న అందరూ ముక్త కంఠంతో ఖండించడం జరిగింది, ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ముంగాజయరాజు, పల్లెపాం.లక్ష్మయ్య,కోపల్లి జయకర్, గద్దల మల్లయ్య,మేడా తిరుపతిరావు,దుంగ గంగరాజు,గొర్రె లాజర్, ధనరాజ్ మాస్టర్,జేటి రాజేంద్రప్రసాద్,లయన్ డాక్టర్ వీర్ల కిరణ్,మారాజు సత్యనారాయణ, రావణబ్రహ్మ,తదితరులు పాల్గొన్నారు

## మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

మార్చి నాటికీ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

మున్సిపాలిటీ పరిధిలో జీతాలు చెల్లింపు ఆలస్యం కాకుండా చర్యలు

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




పెద్దపల్లి,చేరాలరవీందర్, డిసెంబర్ -20 (నేటి శుభోదయ): పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పని తీరు పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... పట్టణాలలో రోడ్ల పై చెత్త లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లపై చెత్త ప్లాస్టిక్ ఉండకుండా చూడాలని అన్నారు. మంథని, సుల్తానాబాద్ పట్టణాలలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి క్రింద మంజూరైన రోడ్లు, డ్రైయిన్, ఇతర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని, రోడ్డు విస్తరణ మొదలగు అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ పోల్స్ ను విద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తొలగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పట్టణాలలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పూర్తి స్థాయిలో వసూలు చేయాలని , మున్సిపాలిటీలలో పని చేసే సిబ్బందికి జీతాల చెల్లింపు లేట్ కాకుండా చూడాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అన్నారు. సుల్తానాబాద్ లోని డివైడర్ లలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణానికి డంప్ యార్డ్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని తహసిల్దార్ తో ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్లూరులో జగనన్న జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

**- ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి**



పులిచెర్ల,డిసెంబర్ 21,(నేటి శుభోదయ): నేడు మండలంలోని కల్లూరులో జరగనున్న మాజీ ముఖ్యమంత్రి వర్యులు మరియు వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు గౌ.శ్రీ వై యస్ జగన్మోహన్ రెడ్డి గారి జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీపీ తన కార్యాలయంలో పత్రిక విలేకరలతో మాట్లాడుతూ గౌరవనీయులు మాజీ మంత్రివర్యులు మరియు పుంగనూరు శాసనసభ్యులు శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు మరియు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి గార్ల ఆదేశాల మేరకు నేడు శనివారం 21 వ తేదీన ఉదయం 09:30 గం' మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు గౌ. శ్రీ వై యస్ జగన్మోహన్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా కల్లూరు నందు పీలేరు రోడ్డులో గల హెచ్పి పెట్రోల్ బంక్ వద్ద కేక్ కట్ చేసి జగనన్నజన్మదినవేడుకలు ఘనంగాజరుపనున్నట్లు తెలియచేసారు.కనుక మండలంలోని అందరూ సర్పంచులు,ఎంపీటీసీలు,వివిధ హెూదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా,మండల,పంచాయతీ స్థాయి వైట్కాఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు,జగనన్న అభిమానులు మరియు ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ గృహ సర్వేకు ప్రజలు సహకరించాలి

**కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య**




**(నేటి శుభోదయ):** డిసెంబర్-20 ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోని పల్లి గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు చేపడుతున్న సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య కోరారు.ఇల్లు లేని వారికి నివాసం కల్పించేందుకు సర్వే చేపడుతున్నట్లు దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి ఎల్లయ్య,గ్రామ వాసులు దావ శ్రీను,లక్ష్మమ్మ,మహబూబా,లక్ష్మీ నర్సింహమ్మ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్ఐవి పై ఎల్ఈడి స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించిన స్వచ్ఛంద సంస్థ




**(నేటి శుభోదయ):** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలలో గాంధీ చౌక్ లో ఎల్ఈడి వ్యాన్ ద్వారా హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్వచ్ఛంద సంస్థ వారు ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెచ్ఐవి అనేది ఒక వ్యాధి ఈ వ్యాధి మన శరీరంలోని రక్తం లో మాత్రమే ఉంటుంది. ఈ వ్యాధి నాలుగు రకాల ద్వారా వస్తుంది ఒకటి సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, రెండవది



కలుషితమైన సూదులు, మూడోది హెచ్ఐవి ఉన్న వారితో రక్తమార్పిడు, నాలుగవది హెచ్ఐవి సోకిన తల్లి కడుపు లో నుండి బిడ్డకు ఇది అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని చెప్పడం జరిగింది. అలాగే హెచ్ఐవి సోకి న వ్యక్తిని తాకినగాని అతనితో కలిసి భోజనం చేసినా కానీ అతను వాడిన వస్తువులు వాడిన కానీ హెచ్ఐవి రాదని వివరంగా ఎల్ఈడి ద్వారా ప్రదర్శించడం చేయడం జరిగింది. అలాగే హెచ్ఐవి సోకిందని అనుమానం ఉన్నవాళ్లు కచ్చితంగా రక్తపరీక్షలు చేయించుకోవాలని చెప్పడం జరిగింది. అలాగే మీకు అందుబాటులో కొన్ని ఎన్జీవోలు హెచ్ఐవి మీద పనిచేస్తున్నవి కనుక వారిని సంప్రదించిన వారు మీకు తగిన సమయంలో సలహాలు సూచనలు ఇస్తూ మిమ్మల్ని భయాందోళన నుండి సురక్షితంగా కాపాడాతారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ మల్లేష్, వై ఆర్ జీ కే.సుప్రియ, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# బిజెపి పార్టీ బూత్ కమిటీల నియామకం



**(నేటి శుభోదయ):** డిసెంబర్-20 :ఆమనగల్లు:మున్సిపాలిటీలో బిజెపి పార్టీ బూత్ కమిటీల నియామకం చేపట్టడం జరిగింది. అందులో భాగంగా 178వ బూత్ కమిటీ నూతన అధ్యక్షునిగా బైకని అశోక్ యాదవ్ ను ఎన్నుకోవడం జరిగింది. మరియు బూత్ సెక్రెటరీ గా సముద్రాల వెంకటేష్ ను ఎన్నుకున్నారు. మీడియా కన్వీనర్ గా బంటి మరియు బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ-2)గా వినయ్ ను నియమించడం జరిగింది. ఈ కమిటీల నియామకానికి ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్లు బైకని యాదమ్మ శ్రీశైలం,శ్రీకాంత్ సింగ్ పాల్గొన్నారు.


# మన పల్లె మన కుటుంబం నినాదం తో కార్యక్రమం



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -20 ( నేటి శుభోదయ ): మంథని నియోజక వర్గం కాటారం మండలం ఎర్రగుంటపల్లిలో శుక్రవారం రోజు గోనే బాపు, గొనే వెంకటస్వామి, తల్లి గొనె సమ్మక్క యొక్క దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మన పల్లె మన కుటుంబం అనే నినాదంతో చేస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా వారి యొక్క కుటుంబానికి 16,800/- రూపాయలు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎర్రగుంటపల్లె లోని పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

## రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



వెల్దండ**(నేటి శుభోదయ):** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని గాన్ గట్టు తాండకు చెందిన ఆంజనేయులు కూతురు శ్రేయస్సీ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈమేరకు ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ,,51,000/- సిఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో సతీష్,శివ, ఇస్మాయిల్,యాదగిరి,సాయి,గిడ్డు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ గృహాలు

## ఇందిరమ్మ కమిటి సభ్యులు విజయ్ రాథోడ్

**(నేటి శుభోదయ):** డిసెంబర్-20 : ఆమనగల్లు:అర్హులైన ప్రతీ పేదవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి



పేదవారి సొంతింటి కల నెర వేర్చుతామని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు విజయ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం అమనగల్లు మండలం మేడిగడ్డ తాండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చప్టా తాండ లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లసర్వే లో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, కమిటీ సభ్యులు హరిలాల్,ఈసందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యుడు విజయ్ రాథోడ్ మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శి యాప్ లో నమోదు చేస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,స్థానిక కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషితో ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందన్నారు. మొదటి దఫాలో నియోజకవర్గానికి 3500 ఇండ్లను నిర్మించేలా సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు.

# మహిళా సంఘాల పని తీరు మెరుగు పర్చాలి.....

- 3 నెలలో మహిళా సంఘాల గ్రేడింగ్ పెంచేందుకు చర్యలు
- ఎన్.పి.ఏ తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు
- స్వశక్తి మహిళా సంఘాల పై అధికారులతో సమావేశం నిర్వహించిన
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, చేరాల రవీందర్ డిసెంబర్ -20( నేటి శుభోదయ): జిల్లాలో ఉన్న మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాల పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....పెద్దపెల్లి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 9102 మహిళా సంఘాలకు సుమారు 478 కోట్ల రుణాల మంజూరు చేయడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3898 సంఘాలకు 322 కోట్ల 68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, నిర్దేశిత లక్ష్యంలో 67.51% రుణాలు మంజూరు చేసామని అన్నారు.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యంలో పెండింగ్ బ్యాంకు లింకేజీ రుణాలను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పెద్దపెల్లి జిల్లాలో ఉన్న ఎన్.పి.ఏ లను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్.పి.ఏ లు అధికంగా ఉన్న సీసీ లు ప్రత్యేక శ్రద్ధ వహించి నెల రోజులలో వాటిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాల గ్రేడింగ్ 3 నెలల కాలంలో పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రేడింగ్ ఈ ఉన్న స్వశక్తి మహిళా సంఘాల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని బి, లేదా ఏ గ్రేడింగ్ వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాలలో నూతనంగా మహిళలను జాయిన్ చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. స్త్రీ నిధి రుణాల రికవరీ పై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రౌండ్ చేసిన యూనిట్లు లాభదాయకంగా నడిచేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, అడిషనల్ డి ఆర్ డి ఓ రవికుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 3వ సారి రాష్ట్ర స్థాయి గణిత సెమినార్ కు జిల్లా ఉపాధ్యాయురాలి ఎంపిక

## గణిత ఉపాధ్యాయురాలు కే. అనిత కు ప్రత్యేక అభినందనలు


## జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి



మంథని /పెద్దపల్లి, చేరాలరవీందర్,డిసెంబర్ -20 ( నేటి శుభోదయ): రాష్ట్రస్థాయిలో జరిగే గణిత సెమినార్ కు ఎంపికైన పెద్దపల్లి జిల్లా గణిత ఉపాధ్యాయురాలు కే.అనిత ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ప్రాచీన వేద గణితం నుండి నేటి క్వాంటం కంప్యూటర్ ముఖ్య అంశముతో భాగంగా ప్రాచీన భారతీయ గణిత శాస్త్రవేత్తలు చేసిన కృషి వారు కనుగొన్న సూత్రాలు ,నేటి తరగతి బోధనకు ఏ విధంగా అన్వయించాలి , విద్యార్థులను గణితము పట్ల ఏ విధంగా ఆసక్తి కలిగించి వారు గణితంలో ముందంజ ఉండేటట్లుగా చేసే విధానాలు అనే అంశము పై కే.అనిత సెమినార్ పత్రము ఎంపిక కాబడిందని జిల్లా విద్యాధికారి తెలిపారు. వరుసగా రెండవ సారి పెద్దపల్లి జిల్లాకి చెందిన గణిత ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి గణిత సెమినార్ కు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంపిక కాబడిన గణిత ఉపాధ్యాయులు డిసెంబర్ 21న హైదరాబాద్ లోని రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ లోని గోదావరి భవన్ లో తమ సెమినార్ ప్రదర్శించాల్సి ఉంటుందని అన్నారు. రామగుండం మండలం యుపిఎస్ దుర్గయ్యపల్లి లో డేపుటేషన్ పై తన విధులు నిర్వహిస్తున్న కే.అనిత నిరంతర గణిత విద్యార్థిగా వినూత్న గణితోపకరణాలు చేసే దిశగా ప్రత్యేకత సాధించారని, ఇటీవల జరిగిన జవహర్ లాల్ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024 లో భాగంగా జిల్లా స్థాయిలో ప్రైమరీ విభాగంలో వీరి పాఠశాల నుండి గణిత మోడలింగ్ అండ్ కంప్యూటింగ్ లో ప్రథమ స్థానం గెలుచుకున్నారని, ప్రాథమిక దశ నుండే గణితం పట్ల ఆసక్తిని పెంపొందించే లాగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాదవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్య ద్వారానే అభివృద్ధికార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్

**(నేటి శుభోదయ):** 20 డిసెంబర్ పలనాడు జిల్లా దుర్గి : విద్య ద్వారానే అభివృద్ధి జరుగుతుందని,పేద వర్గాలు విద్య ద్వారానే అభివృద్ధి చెందుతారని సామాజిక అసమానతలు రూపుమాపటానికి విద్య అవసరమని, దళితులు పేద వర్గాలవారి విద్యాభివృద్ధికి కార్డ్స్ సంస్థ కృషి చేస్తుందని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ అన్నారు కార్డ్స్ సంస్థ పల్నాడు శాఖ దుర్గిలోని ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటుచేసిన బాలబాట డెవలప్మెంట్ ఆర్గనైజర్ల







సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి బాలబాట ఏ సి ఓ కుక్కమూడి ప్రమీల అధ్యక్ష వహించారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ మాచర్ల ,వెల్దుర్తి,దుర్గి ప్రాంతాలలో విద్యకు దూరమైన పిల్లలను కార్డ్స్ సంస్థ వాళ్లకు విద్యనందించి వాళ్లను గురుకుల పాఠశాలలో చేర్చే విధంగా కృషి చేయటం ప్రశంసనీయం అని కార్డ్స్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని బాలబాట డిఓలంతా ఉన్నత చదువులు చదువుకొని సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని నేటి బాలలే రేపటి భారత భావి తరాల పౌరులని సమసమాజ స్థాపనకు కృషి చేయాలి అన్నారు. కలిమెల సైమన్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయిలో ఉన్న బాలబాట డివోళ్లంతా మంచిగా చదువుకొని తెలివితేటలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పాస్టర్ కుక్కమూడి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ బాలబాట డిఓ లందరికీ ముందుగా క్రిస్మస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్డ్స్ సంస్థ బాలబాట ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో బాలబాట ఆర్ సి ఓ పేరుపోగు ప్రసాదు ఏ సి ఓ కుక్కమూడి ప్రమీల మాట్లాడారు. బాలబాట ప్రతిజ్ఞ ,బాలబాట నినాదం ,చైతన్య గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో బాలబాట 25 మంది డివోలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

# కూకట్ పల్లి యువజన కాంగ్రెస్ కలికోట శంకర్ జన్మదిన వేడుకలు



సాధనాల వీరేంద్ర **(నేటి శుభోదయ):** కూకట్పల్లి డిసెంబర్ 20, 2024: ఈ రోజు నా పుట్టిన రోజు సందర్భంగా పేద ప్రజల కడుపు నింపాలని ఒక భావనతో ఈ రోజు బస్వతరక క్యాన్సర్ హాస్పిటల్ వద్ద భోజనం పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ ప్రెసిడెంట్ సుల్తాన్, కలికోట మహేష్, బాలరాజు, జిబెన్, నవాజ్, పాల్గొనడం జరిగింది..



# ఉచిత వైద్య శిబిరం



**(నేటి శుభోదయ):** డిసెంబర్-20 కడ్తాల్:కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ మరియు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్-గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం డాక్టర్ ఉప్పల అఖిల్,డాక్టర్ ఉప్పల అనిల్,డాక్టర్ భావన ప్రారంభించి స్వయంగా 333 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేయడం జరిగింది. కడ్తాల్ మండలంలో నాల్గవ రోజు ఎక్వాయిపల్లి లో వైద్య శిబిరం సందర్శించిన అనంతరం మహాత్మా గాంధీజి కి పుల మాలలు వేసిన డిసిసిబి జిల్లా డైరెక్టర్ -పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,కడ్తాల మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్,రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు జోగు వీరయ్య మాట్లాడుతూ వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ వైద్య శిభిరం సుర్ణావకాశం అలాగే ప్రైవేట్ దవాఖానలో వేలకు వేల రూపాయలు చెల్లించాలి కానీ ఉచితంగా నాణ్యత మైన మందులు ఇవ్వడం గొప్ప అని కొనియాడారు. అదేవిధంగా గ్రామస్థులు ఉప్పల వెంకటేష్ మరియు దశరథ్ నాయక్ కు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్యాలు,సత్తయ్య,బిక్షపతి, చంద్రయ్య, సాయిలు, వెంకటరెడ్డి, జంగయ్య, నర్సింహ,వెంకటయ్య,సత్యనరి,శేకర్,జగదీష్,శేకర్, శివ,కృష్ణయ్య, అంజయ్య, వంశీ, శంకర్, శ్రీశైలం,సత్యనరి,గ్రామ పెద్దలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జీ3 జి.యం

**(నేటి శుభోదయ):** 20- పెద్దపల్లి రామగిరి: ఈనెల 23న నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల కోసం స్థానిక రాణి




రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వేదిక, స్టాల్స్, పార్కింగ్, లైటింగ్ మొదలగు ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులకు సూచనలు ఇచ్చారు. 23 న సాయంత్రం ఆరు గంటల నుండి నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారితో పాటు ఎస్వోటుజియం జి.రఘుపతి, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, డివైఎస్ఈ రామకృష్ణ పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటి అధికారి షబిరుద్దీన్, ఎస్ఇ సతీష్ చంద్ర, అధికారులు గుర్రం శ్రీహరి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొగాకు పంటలలోనీ ముఖ్య యజమాన్య పద్ధతులపై

# రైతులకు అవగాహన సదస్సు

**(నేటి శుభోదయ):** ఇంకొల్లు రిపోర్టర్ గద్దె. సలోమాన్ రాజ్: బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం



దుద్దుకూరు గ్రామంలో గురువారం పొగాకు పంటలపై దుద్దుకూరు గ్రామ రైతులకు జిపిఐ కంపెనీ వారు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ పూజిత మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతిలో నాలుగు సార్లు వ్యవసాయం దున్ని పిలక కోట్టి నాలుగు వోలుపులుగా కొట్టాలని రైతులకు తెలియజేశారు. పిసికిరి చేసే ముందు బయోమందులను వాడకూడదని చెప్పారు కంపెనీ మందులను వాడాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిపిఐ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోష్ణ, రాజశేఖర్, ప్రసాద్ మరియు దుద్దుకూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అంగవైకల్యంకలిగిన వ్యక్తి....

### 90% సదరం సర్టిఫికెట్ కలిగి ఉన్నావాహనంఇవ్వలేదనిఆవేదన....

### వికలాంగ వాహనం కోసం ఎదురు చూపు....



వి.ఆర్.పురం ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్20:-అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామ చంద్రాపురం మండల పరిధిలో, రామవరం పంచాయతీ నందు కొప్పల్లి గ్రామంలో శుక్రవారం నాడు జరిగిన రెవిన్యూ సదస్సుకు యూనిట్ ఇంచార్జ్ గా వెళ్లిన బీరక సూర్య ప్రకాష్ కు శబరిరాయి గూడెం గ్రామానికి చెందిన కుకునూరు రామారావు 40 సం,,రాలు(తండ్రి) వెంకయ్య, వికలాంగుడు తన ఆవేదనని వ్యక్తంచేశారు.రెండుకాళ్ళు పనిచేయవు,చచ్చుపడిఉన్నాయి.నడవలేని,పరిస్థితి,సదరం సర్టిఫికెట్ నందు 90% కలిగి ఉన్న ప్రభుత్వం నుండి వచ్చు వికలాంగ వాహనం మంజూరు చేయలేదని,పెన్షన్ 6000 రూపాయలు వస్తున్నాయని 15వేల రూపాయలు పెన్షన్ కు అర్హుడ్ని చేయాలని యూనిట్ ఇంచార్జ్ బీరక సూర్య ప్రకాష్ ని అడగగా యూనిట్ ఇన్చార్జి నీసమస్యని,రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు,మిరియాల శిరీషాదేవి, దృష్టికి తీసుకువెళ్లి నీకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే ద్వారా వాహనంమంజూరు చేసేవిధంగా చూస్తానని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ ప్రజలసంక్షేమం,ప్రజల శ్రేయస్సు కోసం, పాటుపడుతుందని,యూనిట్ ఇన్చార్జి బీరక సూర్య ప్రకాష్ వివరించారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మడకం రాజు,ఎం.ఆర్.పి.ఎస్ నియోజకవర్గ కన్వీనర్ బింగి విష్ణుమూర్తి,తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



## కేంద్ర హెూం మంత్రి రాజీనామా చేయాలని దిష్టిబొమ్మ దగ్ధం



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ**): దేశానికి హెూం మంత్రి గా వున్న వ్యక్తి ఎటువంటి సిగ్గు శరం లేకుండా దేశ రాజ్యాంగాన్ని తయారు చేసిన మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దేశ ప్రతిష్టను పరువు తీయడమే అని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. శుక్రవారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరుకు ర్యాలీ నిర్వహించి హెూం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను సరితా క్లినిక్ సెంటర్ లో దగ్ధం చేశారు . ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అమిత్ షా.. అంబేద్కర్ ను కించపరిచేలా చేసిన వాఖ్యలు దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను అవమానించేలా వున్నాయి అని విమర్శించారు. ఆయన తన మనువాద దృక్పథాన్ని బయట పెట్టారు అని విమర్శించారు మోడీ కూడా అమిత్ షా ను సమర్థించడం తీవ్ర అన్యాయం అని ఆరోపించారు. అమిత్ షా కు కేంద్ర హెూంశాఖ మంత్రి గా వుండే హక్కు లేదు అని వెంటనే రాజీనామా చేయాలని అని డిమాండ్ చేశారు. రాజీనామా చేసే వరుకు ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బుగ్గవీటి సరళ, టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు




## నలుగురు మందుబాబులకు అయిదు రోజులు

## మంచిర్యాల బస్టాండ్ క్లీనింగ్ శిక్ష విధించిన మేజిస్ట్రేట్...

మంథని /పెద్దపల్లి,చేరాలరవీందర్,డిసెంబర్ -20( నేటి శుభోదయ): మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీ లలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారిని రెండో వ అడిషనల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా వారిలో నలుగురు మందుబాబులకు అయిదు రోజులు మంచిర్యాల బస్టాండ్ క్లీనింగ్ 20.12.2024 నుండి 24.12.2024 రోజు వరకు కమ్యునిటి సర్వీస్ లో భాగంగా పనిష్మెంట్ ఇవ్వడం జరిగింది. శుక్రవారం రోజు గత కొద్దీ రోజులుగా పట్టుబడిన 22 మందిని కోర్ట్ లో హాజరు పర్చగా అందులో 14 మందికి ట్రాఫిక్ అసిస్టెంట్ విధులు అయిదు రోజులు( 21 - 25.12.24) చేయాల్సిందిగా, ఎనిమిది మందికి 17500/- రూపాయలు జరిమానా విధించారు. కావునా వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలను నడపాల్సిందిగా సూచించడం జరిగినది.

# అరుదైన సంఘటన

### ప్రభుత్వ జూనియర్ చదువు చెప్పిన గురువులను గౌరవించిన పూర్వ విద్యార్థులు



**(నేటి శుభోదయ):** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల ప్రభుత్వ కళాశాలలో ఈరోజు అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ధర్పల్లి ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించినటువంటి పూర్వ విద్యార్థులు ఇటీవల నిర్వహించినటువంటి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సంపాదించిన వాల్గొట్ గ్రామానికి చెందిన శ్రావణ్, అదే గ్రామానికి చెందిన రవి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందడం జరిగింది. కృతజ్ఞత భావంతో వారు కళాశాలకు విచ్చేసి విద్య నేర్పినటువంటి గురువులు లాబిశెట్టి మహేష్, సురేష్ బాబు, మామిడి విట్టల్, అర్చన మేడం లను ఘనంగా శాలువా కప్పి పూలమాలలతో సన్మానించినటువంటి సంఘటన ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మేము చదువు చెప్పిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు అంతే కాకుండా చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించాలనే ధోరణి వీరి బోధననే కారణమని పూర్వ విద్యార్థులు అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖమ్మం ,46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ**): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ గారి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నందు కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరినారు. వీరితో పాటు ఖమ్మం నగర, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు తొగరు భాస్కర్, సహాయ కార్యదర్శి తొగరు రమేష్,నగర ముస్లిం మైనారిటీ కార్యదర్శి షేక్ గౌస్ పాషాలు చేరినారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కు కండువాకప్పి సాదరంగా ఆహ్వానించినారు. 46వ డివిజన్ పరిధిలోని డివిజన్ అభివృద్ధితోపాటు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన 46వ డివిజన్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రుణపడి ఉంటదని డివిజన్ అభివృద్ధికి మా వంతుగా కృషి చేస్తామని చెప్పినారు..

### ఈ సందర్భంగా 46 వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న మాట్లాడుతూ..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, 46వ డివిజన్ సారధి నగర్ నందు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం 46వ డివిజన్ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి ప్రజా సంక్షేమాలకు ఆకర్షతుడినై ఈరోజు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ గారి నాయకత్వంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ గారి తో కలిసి సంజీవరెడ్డి భవన్ నందు కాంగ్రెస్ కండువా కప్పుకొని కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయినాను... ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,46 వ డివిజన్ అధ్యక్షులు షేక్ రజి భాయ్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కోసూరి రమేష్ గౌడ్,వాలబోయిన వేంకటేశ్వర్లు మరియు 46 వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి...

### ఎం.పి.పి,కారం లక్ష్మి...

### సర్పంచ్ కారం బుచ్చమ్మ...

వి.ఆర్.పురం,ప్రతినిధి(శుభోదయ)డిసెంబర్20 :వి.ఆర్.పురం, మండలంరామవరంగ్రామపంచాయతీ పరిధిలోని శబరిరాయిగూడెం, కొప్పల్లి, గ్రామంలో రెవిన్యూ సదస్సులు జరిగాయి.శుక్రవారం ముఖ్య అతిథులుగా! ఎం.పి.పి, కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్,కారం బుచ్చమ్మ,పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను గిరిజనులు వారి భూమిహక్కు పొందెందుకు అవసరంమేర ఈ గ్రామసభలో దరఖాస్తులు పెట్టుకొని






ఈ కార్యక్రమాన్ని సద్విని చేసుకోవాలని,కోరారు.అలాగే ఏజెన్సీ ప్రాంతంలోనిగిరిజనులు పూర్తిస్థాయిలో అవగాహనతో ప్రభుత్వ పథకాలతోపాటువారిహక్కులను సాధించుకొనుటకు ఉపయోగించు కోవాలని ఆమె కోరారు.రైతు సంఘం కార్యదర్శి వడ్లది రమేష్, మాట్లాడుతూ శబరిరాయిగూడెం,కోప్పల్లి , గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ, కులాలకుచెందిన రైతులు మండలంలో 100 ఎకరాలు పైనే భూమిసాగులోఉంటుందని,ఈ పేదరైతులు తాతలకాలంనుండి




సాగు చేసుకుంటున్నారని. మాకు ఉన్న కొద్దిపాటి సాగు పంట భూములకు సాగు ధ్రువీకరణ మీ భూమిలో వెబ్ ల్యాండ్ యాప్న పొందుపరుచుటకు మరియు పోలవరం,భూపరిహారం 2013 చట్టం భూసేకరణ అనుసరించి పరిహారం చెల్లించుట కొరకు. . మేము మా పెద్దల కాలము నుండి కొద్దిపాటి భూమి వ్యవసాయం కూలి పనులతో జీవనంసాగించుకుంటున్నాము. సెటిల్మెంట్ అధికారులు మామీద కనికరంచూపించకుండా కొంత భూమికి హక్కు పత్రములు ఇచ్చి, కొంత భూమికి అభ్యంతరం పెట్టి, డి.ఐ.ఎస్,కూడా చేసిఉన్నారు 50 సంవత్సరాలు మేము సాగులో ఉన్నాము.మానిర్వాసితులకు మేలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మీభూమి,మీహక్కు రెవిన్యూ సదస్సులో తాసిల్దార్ కి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగిందని, తాసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ మీభూమి,ఎఫ్ కు ఎక్కించుటకు ప్రయత్నంచేస్తానని, పైఅధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చారు.ఇచ్చిన ఆమెని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో న్యాయస్థానానికి వెళ్తామని అన్నారు.వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వి.ఆర్.పురం,మండల రైతుసంఘం మండల కార్యదర్శి వడ్ల రమేష్, ఆర్.టి.జి.ఎస్, ద్వారా!అనగారియల్ టైం ప్రభుత్వ సేవాద్వారా!పరిష్కరించాలని కోరుతూ టెస్ట్ రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించడం జరిగినదన్నారు.




ఈకార్యక్రమంలో శాఖ కార్యదర్శి నాగరాజు, కుకునూరు సుందరయ్య, కుకునూరు మురళి,తార కాంతమ్మ,కోట్ల అప్పారావు, ముత్యాల శ్రీనివాసరావు,వీఆర్వో, సర్వేర్, గ్రామపంచాయతీ సెక్రటరీ తాతారావు,సచివాలయం సిబ్బంది రెవిన్యూ సిబ్బంది గిరిజన గ్రామ రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమలలో పాల్గొన్న రాష్ట్ర ఐటి మంత్రి సోదరుడు దుద్దిల్ల శ్రీను బాబు

### శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీను బాబు



మంథని / పెద్దపల్లి, చేరాల రవీందర్, డిసెంబర్-20 ( నేటి శుభోదయ): మంథని నియోజకవర్గంలో శుక్రవారం రోజు కాటారం మండల కేంద్రంలో శ్రీ చెన్నకేశవ లారీ యజమానుల సంక్షేమ సంఘం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని యూనియన్ కార్యాలయం ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మంథని మండలం ఖానాపూర్ గ్రామం లో నర్రా లక్ష్మి -శంకర్ దంపతుల కుమారుడు





ప్రశాంత్ - సంగీతల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కేపల్లి గ్రామానికి చెందిన మబ్బు తిరుపతి మంథనిలో ఇటీవల గృహప్రవేశం కాగా శుక్రవారం వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. మంథని ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు జంజర్ల శైలేందర్ సోదరుడు గణేష్ పుట్టినరోజు సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీను బాబు వెంట మంథని మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, పోలు శివ,పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు ఉన్నారు.



## భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానం

### అమిత్ షా వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి..

### రాజ్యాంగ నిర్మాతను బీజేపీ ప్రతి సారి హేళన చేస్తోంది.

### అమిత్ షా పై చర్యలు తీసుకునేంత వరకు కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుంది.



మంథని / పెద్దపల్లి, చేరాల రవీందర్, డిసెంబర్-20 (నేటి శుభోదయ): లోకసభ లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా డా.




బి.ఆర్ అంబేద్కర్ గారి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, అమిత్ షా ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో, రాష్ట్ర మంత్రులతో,సహచర ఎమ్మెల్యేలతో, ఎమ్మెల్సీలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్.

## పల్లె ప్రగతితో తెలంగాణ గ్రామాల అభివృద్ధి దేశానికి ఆదర్శం



**(నేటి శుభోదయ):** డిసెంబర్-20 కడ్తాల్:కడ్తాల్ పంచాయతికి బీహార్ సర్పంచుల అభినందన. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతితో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని,ఆరోగ్యకరంగా మారాయని బీహార్ గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు(సర్పంచులు)అన్నారు.రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి(ఎల్ఎన్ రెడ్డి)బీహార్ సర్పంచులతో NIRDPR రాజేంద్రనగర్ లో సమావేశమై గత పాలకవర్గంలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ,వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ,తడి చెత్త,పొడి చెత్త వేరు విధానం,ఇంకుడు గుంతల నిర్వహణ,పల్లెప్రకృతి వనం,రైతు వేదిక, వైకుంఠధామం నిర్మాణాలు, గ్రామపంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు మొదలగు అంశాలను వివరించారు.గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో అందరితో కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకున్నందునే అభివృద్ధిలో ముందున్నామని తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ అరుణ్ రాజ్,బీహార్ గ్రామపంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక విద్య పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

### ఓదెల, శ్రీరాంపూర్ మండలం లోని ఉపాధ్యాయులతో కాఫీ విత్ టీచర్స్ కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మంథని /పెద్దపల్లి, చేరాల రవీందర్, డిసెంబర్ -20 ( నేటి శుభోదయ): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు కల్పించాలని,వారిలో పఠనం ,గణితం సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓదెల ,శ్రీరాంపూర్ మండలాల ఉపాధ్యాయులతో సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కాఫీ విత్ ఉపాధ్యాయుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... విద్యార్థులలో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో బోధన విధానంలో ఉన్న లోపాలను సవరించుకొని మీ పాఠశాలలోని 80 శాతం పిల్లలలో పఠన ,గణిత సామర్థ్యాలు పెంచినట్లయితే జిల్లా స్థాయిలో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రోత్సాహక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలపడం జరిగింది. విద్యార్థులలో సామర్థ్యాలను పెంచుటకై మధ్యాహ్నం షెడ్యూల్ లో ఏడు, ఎనిమిది పీరియడ్స్ ను రిమీడియట్ బోధనను నిర్వహించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్ తో ఆవు మృత్యువాత



కేశంపేట(నేటి శుభోదయ): కరెంట్‌షాక్ కొట్టి ఆవు మృతిచెందిన ఘటన శుక్రవారం కేశంపేట మండల పరిధిలో కోమల్ పల్లి గ్రామ శివారులో జరిగింది. నిదురం జంగయ్య చెందిన ఆవు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా కరెంట్ షాక్ కొట్టి చనిపోయింది. ట్రాన్స్ఫర్మర్ కు చుట్టూ రక్షణ దిన్నెలు నిర్మించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 80 వేల రూపాయలకు ఆవును కొన్నానని రైతు రోదించాడు. తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని నీదురం జంగయ్య కోరాడు.

## యేసుక్రీస్తును అనుసరించి జీవించాలి

### ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -20( నేటి శుభోదయ): యేసుక్రీస్తు బోధనలు అందరూ ఆచరించదగినవని, ఆయనను అనుసరించి జీవించాలని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. శుక్రవారం మంథని మునిసిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ నగర్ సీయోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యారల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "కన్య మరియ గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడని," " నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించ దాగినవన్నారు". ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, అనంతరం సహాపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్థన మందిరం స్థానిక పాస్టర్ అజ్మీరా దయరాజు, పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, గద్దల రాజేష్, సంఘ పెద్దలు ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్,చింతకుంట్ల ప్రేమ్ కుమార్, అందె రమేష్, ఈర్ల సదానందం, రామగిరి కుమార్, కామని మల్లారెడ్డి, ఉప్పలపాటి జాన్, సొళ్ళ స్వామి, కన్నూరి రాజేశం, సుమంత్ రాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాస్ యాదవ్ కు జర్నలిస్టుల పరమార్శ



తలకొండపల్లి(**నేటి శుభోదయ**): రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి చీపిరి విశ్రాంత ప్రధానోపాధ్యాయు లు జంగయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల జర్నలిస్టులు గురువారం వారి స్వగ్రామం వెల్జాల్ గ్రామానికి వెళ్లి అతని ప్రథమ పుత్రుడు ,మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ ను పరామర్శించారు. చీపిరి జంగయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. సందర్భంగా ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు దరువుల శంకర్ మాట్లాడుతూ జంగయ్య సారు మండలంలోని రాంపూర్ గ్రామంలో అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే తగ్గిందన్నారు ఆయన లేని లోటు అతని స్వగ్రామానికి మండల ప్రజలకు తీరనిలోటు అని ఈ సందర్భంగా వారు కొనియాడారు . అనంతరం అతని చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ప్రెస్ క్లబ్ తలకొండపల్లి మండల అధ్యక్షులు దరువుల శంకర్ , గౌరవ అధ్యక్షులు చీపిరి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు తిరుపతి, జర్నలిస్టులు వెంకటరెడ్డి , చంద్రకుమార్, మహేష్, రాజు, శేఖర్ జూలపల్లి సర్పంచ్ విజయ్ కుమార్ తోపాటు మిడ్జిల్, వంగూరు మండలాలకు చెందిన బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు తరలి వచ్చారు.

## మంథని మాజీ ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు 103 వ జయంతి వేడుకలు

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు



మంథని, చేరాల రవీందర్, డిసెంబర్ -20 (నేటి శుభోదయ): మంథని నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులు స్వర్గీయ గులుకోట శ్రీరాములు 103 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ... మంథని నియోజక వర్గానికి మొట్టమొదటి సారి ప్రతినిత్యం వహించిన గొప్ప వ్యక్తి వ్యక్తి అని కొనియాడారు. రజాకార్ల పరిపాలనలో గులుకోట శ్రీరాములు పోరాటం చేసిన గొప్ప నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేల్పుల గట్టయ్య,,తగరం శంకర్ లాల్, పుప్పాల తిరుపతి, ఇర్ఫాన్, ఆసిఫ్ ఖాన్, జంగడి రాజయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బి-జి మానవ హక్కులు మరియు అవినీతి నిరోధక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(**నేటి శుభోదయ**): బి-జి మానవ హక్కులు మరియు అవినీతి నిరోధక సంఘం జాతీయ అధ్యక్షులు గుండా రెడ్డి మల్లికార్జున రెడ్డి గారి ఆధ్వర్యంలో ఆంధ్ర-తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది..ఈ సమావేశం కి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వివిధ జిల్లాల నుండి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు...ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ప్రకటించడం జరిగింది.ఈ సందర్భంగా రావులపల్లి. తిరుపతయ్య గారిని బి-జి మానవ హక్కులు మరియు అవినీతి నిరోధక సంఘం జాతీయ జనరల్ సెక్రెటరీ గా ప్రకటించిన జాతీయ అధ్యక్షులు గుండా రెడ్డి మల్లికార్జున రెడ్డి గారు..ఈ సమావేశంలో మానవ హక్కుల సంఘం అభివృద్ధి కోసం పాటుపడిన కొందరు సభ్యులకి జిల్లా, రాష్ట్ర స్థాయి హోదాలు ఇవ్వడం జరిగింది.. అనంతరం సభ్యుల యొక్క రక్షణ భరోసా భద్రత కోసం ఆలోచించి మానవ హక్కులు - అవినీతి నిరోధక సంఘం సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ బాండ్లను అందించడం జరిగింది... అనంతరం మానవ హక్కుల సంఘం కోసం పనిచేసిన వారిని గుర్తించి జాతీయ ఉత్తమ సేవ అవార్డులు ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది.. ఈ ఈ కార్యక్రమంలో బి అండ్ జి మానవ హక్కుల - అవినీతి నిరోధక సంఘం జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి. మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో తెలుగు రాష్ట్రాలతో పాటు అన్ని రాష్ట్రాలలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ఎదుటి వ్యక్తిని స్వేచ్ఛను హక్కులను కాలరాస్తున్నాయని మానవ హక్కుల రక్షణ దేయంగా మా సంస్థ పనిచేస్తుందని, అదేవిధంగా మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయిందని, జవాబు విచారితనం కుంటుబడిపోయిందని, మానవ హక్కుల సంఘం అవినీతి నిరోధక సంఘం అధ్యక్షులు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున్రెడ్డి విమర్శించారు. మానవ హక్కుల రక్షణ కోసం మా సంస్థ ప్రజల కోసం నిత్యం పనిచేస్తుందని ప్రజలకు అందుబాటులో ఉంటామని మా సంస్థ సభ్యులు కోసం ఎవరైనా మా టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించవచ్చని ఫోన్: 8142395104. పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు లంచాలకు పాల్పడుతున్నారని లంచాలు తీసుకునే వారిని ప్రభుత్వాలు నిరోధించాలని వారిపై కఠిన చర్యలు తీసుకొని కఠిన చట్టాలు తీసుకురావాలని మానవ హక్కుల ఉల్లంఘన జరక్కుండా మానవ హక్కుల ఉల్లంఘన పాల్పడే వారిపై కఠిన చట్టాలు తీసుకురావాలని ఇటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మానవ హక్కులు మరియు అవినీతి నిరోధక సంఘం అధ్యక్షులు గుండా రెడ్డి మల్లికార్జున్ రెడ్డి గారు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది... ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షత బాధ్యతలు వహించిన తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ రామారావు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల.రామారావు, ఎలిసెట్టి రామారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్, తెలంగాణ స్టేట్ మహిళ విభాగం చైర్మన్ మాధవి, స్వరూప..తెలంగాణ రాష్ట్ర మహిళ విభాగం వైస్ చైర్మన్, యం..సువర్ణ... స్టేట్ మహిళ విభాగం సెక్రెటరీ, కుసుమ.స్టేట్ మహిళ విభాగం చీఫ్ సెక్రటరీ,జయ. మహిళా విభాగం స్టేట్ సెక్రెటరీ.పల్నాడు జిల్లా చైర్మన్ జయ,షెమ్మి మ్మును తెలంగాణ రాష్ట్ర స్టేట్ మహిళ విభాగం జనరల్ సెక్రెటరీ,యాకూబ్..నవీన్,మంచిర్యాల జిల్లా చైర్మన్ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు

## సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి సన్మానించిన

### వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు



తలకొండపల్లి (**నేటి శుభోదయ**): రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు. తెలంగాణ రాష్ట్ర టాస్క్ సి.ఓ.ఓ.గా నియమితులైన శుభ సందర్భంగా సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ని హైదరాబాదులోని కార్యాలయంలో కలిసి సన్మానం చేసిన ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి ,వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ధర్మకర్త జి శ్రీనివాస్ మూర్తి , మాజీ ఎంపిటిసి ఎం అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ నాయకులు పి అశోక్ బాబు వి రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.తధానంతరం వెల్జాల్ గ్రామంలోని శ్రీ.శ్రీ.శ్రీ.వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం మీ యొక్క ఐక్యత పౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరడం జరిగింది. ఈ సందర్భంగా సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకొని నా వంతు సహాయ సహకారం అందిస్తాను అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్జాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాల సాహితీవేత్త సయ్యద్ షఫీ కి ఘన సన్మానం

### రావినూతల పాఠశాలలో బాల సాహిత్య కార్యాశాల.



రాథోడ్ ( నేటి శుభోదయ )బోనకల్, డిసెంబర్ 20 :- విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి బాలసాహితీవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కథా కార్యశాల ఉపయోగపడుతుందని బాలసాహితీవేత్త సయ్యద్ షఫీ పేర్కొన్నారు. రావినూతల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కథాకార్యశాలకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి పుల్లయ్య వ్యవహరించగా, పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని మద్దినేని జ్యోతి సంధానకర్తగా వ్యవహరించగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సయ్యద్ షఫీ ని పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పాఠశాలలోని వంద మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ"విద్యార్థులు ఈ కార్యశాలలో నేర్చుకునే విషయాలని అవగాహన చేసుకుని రచనలు చేసినట్లయితే సత్ప్రవర్తన కలిగి ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారని సాహిత్యం చదవటం రాయటం ద్వారా మానసిక వికాసం కలుగుతుందని,సమాజాన్ని అవగాహన చేసుకోగలుగుతారని. కనుక ప్రతి విద్యార్థి చదవడం- రాయడం అనే అంశాన్ని తప్పక అనుసరించాలని అన్నారు. నేటి బాల సాహితీవేత్తలే రేపటి సాహితీవేత్తలై వ్యవస్థకు మార్గదర్శకులు అవుతారు"అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పొగాకు పంటలలోనీ ముఖ్య యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు



**(నేటి శుభోదయ):** ఇంకొల్లు రిపోర్టర్ గద్దె. సలోమాన్ రాజ్: బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో గురువారం పొగాకు పంటలపై దుద్దుకూరు గ్రామ రైతులకు జిపిఐ కంపెనీ వారు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ పూజిత మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతిలో నాలుగు సార్లు వ్యవసాయం దున్ని పిలక కోట్టి నాలుగు వోలుపులుగా కొట్టాలని రైతులకు తెలియజేశారు. పిసికిరి చేసే ముందు బయోమందులను వాడకూడదని చెప్పారు కంపెనీ మందులను వాడాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిపిఐ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోష్ణ, రాజశేఖర్, ప్రసాద్ మరియు దుద్దుకూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## చీపునుంతల గ్రామంలో బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

### మండల అధ్యక్షులు తిరుమణి రవి గౌడ్



తలకొండపల్లి (**నేటి శుభోదయ**): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో మండల అధ్యక్షులు తిరుమణి రవి గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నూతన కమిటీ ఏకగ్రీవంగాఎన్నుకోవడం జరిగింది.చీపునుంతల23 బూత్ కమిటీ అధ్యక్షులు వస్పుల రమేష్,గౌరవ అధ్యక్షులు పసునూరి బాలస్వామి,ప్రధాన కార్యదర్శి మొగిళ్ల దశరథం,తలకొండపల్లి ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల దళిత మోర్చ అధ్యక్షులు మిద్ద మల్లేష్, బిజెపి సీనియర్ నాయకులు నీలకంఠ మహేష్,గుమ్మడి పరమేష్, తుమ్మలి శ్రీను, శ్రీకాంత్,మార్చ ప్రభాకర్, గడ్డమీది రమేష్, గడ్డమీద భాస్కర్, చలిచీమల బిక్షపతి, బండోజు మమత, పాల్గొనడం జరిగింది.

## సెమీ క్రిస్మస్ సందర్భంగా గ్రేస్ ఆఫ్ క్రైస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ఘనముగా క్రిస్మస్ ర్యాలీ



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం,నేటి శుభోదయ,సెమీ క్రిస్మస్ సందర్భంగా శ్రీనగర్ కాలనీ 13వ లైన్ లో ఉన్న గ్రేస్ ఆఫ్ క్రైస్ట్ చర్చ్ తరపున సంఘస్తులు అందరూ కలిసి క్రిస్మస్ ర్యాలీనీ ఘనంగా నిర్వహించారు . ఇందులో సంఘ కాపరి పాస్టర్ ఆనంద్ , పాస్టరమ్మ ప్రసన్న మరియు సంఘస్తులు మల్లయ్య , మోసెస్ , మురళి, భాగ్యలక్ష్మి, పృధ్వీ , రాజు, ఏసుబాబు, తదితరులు పాల్గొని యేసు ప్రభువు జన్మదినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్స్ పంచి క్రిస్మస్ అందాన్ని అందిరికి తెలియజేశారు . ఈ సందర్భంగా పాస్టర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తు యొక్క పుట్టక గురించి తెలియజేస్తూ యేసుక్రీస్తు లోక పాపముల నుంచి మనుషులను విడిపించడానికి వచ్చిన రక్షకుడని వీధులలోని జనములందరికీ సువార్త ప్రకటించారు . చిన్న పిల్లల నృత్యలు , క్రొవ్వొత్తుల ర్యాలీ అందరినీ ఆకర్శించాయి . అనంతరం నిరుపేద వంటరి మహిళలకు నూతన వస్త్రాలు బహుకరించి దేవుని ప్రేమను చాటారు . ఈ ర్యాలీని శ్రీనగర్ కాలనీ నుండి ప్రారంభించి రోటరీనగర్ , మమతా హాస్పిటల్ రోడ్ , లాకారం సర్కిల్ , గొల్లగూడెం రోడ్ మీదిగా సుమారు 300 మంది విశ్వాసులుతో కొనసాగించారు .

## రోడ్ నెం.2 బంజారా హిల్స్లో ఔరా జ్యువెలరీ గ్రాండ్ లాంచ్

### బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ టీపీసీసీ ప్రెసిడెంట్ (ఎమ్మెల్సీ) ఆవిష్కరించారు

### అత్యుత్తమ ఔరా జ్యువెలరీ ఫ్యాషన్ జ్యువెలరీని లాంచ్‌లో టాప్ మోడల్‌లు ప్రదర్శించారు.



సికింద్రాబాద్ జిల్లా **(నేటి శుభోదయ):** ప్రతినిధి సాయి డిసెంబర్ 20బీ ఔరా జ్యువెలర్స్ హైదరాబాద్‌లో రోడ్ నెంబర్ 2, బంజారాహిల్స్‌లో తన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించడం పట్ల ఆనందంగా ఉంది అని ఇది హైదరాబాద్‌లోని ఆరా జ్యువెలర్ యొక్క మొదటి స్టోర్, మరి ఎన్నో త్వరలో ఆవిష్కరించబడతాయి అని మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. లైక్ అఖ్తర్ మేనేజింగ్ డైరెక్టర్ ఔరా ఫ్యాషన్ జ్యువెలర్ - నికితా డైరెక్టర్ ఔరా ఫ్యాషన్ జ్యువెలర్ మాట్లాడుతూ "బంజార్ హిల్స్‌లో మా ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించినందుకు మేము సంతోషిస్తున్నాము అని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజలు స్టైల్ కాన్షియస్, విభిన్న డిజైన్‌లు మరియు కలెక్షన్‌లతో ప్రయోగాలు చేయడానికి ఇష్టపడతారు. మా స్టోర్‌లలో ప్రదర్శించబడే అనేక రకాల సేకరణలను మా కస్టమర్లు ఇష్టపడే విధంగా అనేక రకాల అనేక రకాల సేకరణను మా స్టోర్లో అందుబాటులో ఉంచాము . మా కస్టమర్లు ఆనందించే విధంగా మా సేవలను అందిస్తున్నాం.





## తీవ్ర అల్పపీడనం - భారీ వర్షాలు

అమరావతి : నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ప్రస్తుతం ఇది ఉత్తర దిశగా ప్రయాణిస్తోంది. తీవ్ర అల్పపీడనం వల్ల మరో 48 గంటల్లో వర్షాలు కురుస్తాయని, గంటకు 35-45 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్ష సూచనలు ఉన్నాయని తెలిపింది. మూడు రోజులపాటు కోస్తాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం కాకినాడ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. గురువారం నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని విశాఖ వాతావరణశాఖ హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని అన్ని పోర్టులతో పాటు.. దక్షిణ కోస్తాలోని మచిలీపట్నం పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికలను విశాఖ తుఫాన్ కేంద్రం జారీ చేసింది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉందని చెప్పారు.



## జేపీసీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

ఢిల్లీ : జమిలి బిల్లుల కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)లో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి చోటు దక్కింది. జమిలి బిల్లుల కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేశారు. ఈ జేపీసీ కమిటీలో రాజ్యసభ నుంచి 12మందికి చోటు కల్పించింది. ఆ 12మందిలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు(జమిలి ఎన్నిక బిల్లును)ను లోక్‌సభ శుక్రవారం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపింది. ఇప్పటికే మంగళవారం దిగువ సభలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశ పెట్టగా.. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని విపక్షాలు ఆరోపించాయి. సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపాలని డిమాండ్ చేయడంతో లోక్‌సభ జేపీసీకి పంపింది. మరోవైపు లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది.. మొత్తం 31 మందితో కూడిన జేపీసీ జాబితాను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. పీపీ చౌధరిని ఈ కమిటీకి చైర్మన్‌గా నియమించారు. కమిటీలో అనురాగ్ ఠాకూర్, అనిల్ బలూనీ, సంబిత్ పాత్రా, శ్రీకాంత్ ఏక్‌నాథ్‌షిండే, సుప్రియా సూలే, ప్రియాంక గాంధీ, మనీష్ తివారీ, సెల్వ గణపతి తదితరులకు చోటు దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి (రాజ్యసభ నుంచి), బాలశౌరి(జనసేన), హరీష్ బాలయోగి(టీడీపీ), సీఎం రమేష్(రాజ్యసభ నుంచి)లకు జేపీసీలకు అవకాశం ఇచ్చారు.




## అంబేద్కర్ వల్లే మోదీ, అమిత్ షాకు పదవులు: జగ్గారెడ్డి

హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇదే సమయంలో అంబేద్కర్ రాజ్యాంగం వేరు.. భగవంతుడు వేరు అన్న విషయం అమిత్ షా గుర్తించాలి అంటూ కామెంట్స్ చేశారు. తాజాగా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించిన విధానంపై రాహుల్ గాంధీ గళం విప్పారు. పార్లమెంట్ నిండు సభలో అంబేద్కర్‌ను అవమానించేలా అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొనే వరకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు. చట్టాలు, న్యాయాలు అంబేద్కర్ రాజ్యాంగం వల్లే ఉన్నాయి. బీసీలుగా చెప్పుకొనే మోదీ, అమిత్ షా కూడా అంబేద్కర్ రాజ్యాంగం వల్లే పదవులు పొందారు. అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ ప్రజల భావాలు దృష్టిలో పెట్టుకొని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు. రాహుల్ గాంధీ బాధ్యత.. గాంధీ, నెహ్రూ అడుగుజాడల్లో నడవటం. అంబేద్కర్ రాజ్యాంగం వేరు భగవంతుడు వేరు అనే విషయం అమిత్ షా గుర్తించాలి. అమిత్ షా, రాహుల్ గాంధీకి తేడా.. రాహుల్ గాంధీ దేవుని మొక్కుతాడు కానీ పబ్లిసిటీ చేయరు. బీజేపీ నేతలు కూడా దేవుడ్ని మొక్కుతారు కానీ, పబ్లిసిటీ చేసుకుంటారు. దేవుడు అనేది నమ్మకం ధైర్యం.. భగవంతుడు అనేది వ్యక్తిగత విషయం. కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీ పిలుపునకు సిద్ధంగా ఉంటారు' అని కామెంట్స్ చేశారు.



## పాకిస్తాన్‌కు షాకిచ్చిన అమెరికా..

వాషింగ్టన్: దాయాది దేశం పాకిస్తాన్‌కు అగ్ర రాజ్యం అమెరికా బిగ్ షాకిచ్చింది. పాక్‌కు చెందిన నాలుగు మిస్సైల్స్ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో పాకిస్తాన్ క్షిపణులపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. దీర్ఘశ్రేణి క్షిపణి టెక్నాలజీ మిస్సైల్స్ తయారుచేయడం తమకు సైతం అమెరికాకు కూడా ముప్పే అంటూ చెప్పుకొచ్చింది. దీర్ఘశ్రేణి క్షిపణి టెక్నాలజీ వ్యాప్తికి సహకరిస్తున్నాయంటూ పాక్‌కు చెందిన నాలుగు సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా ఆంక్షల విషయంపై అమెరికా డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ జోన్ ఫైనర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాక్ దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేయడం అమెరికాతో సహా దక్షిణాసియా దేశాలకు పెద్ద ముప్పు. అందుకే ఆ దేశానికి చెందిన నాలుగు సంస్థలపై ఆంక్షలు విధించడం జరిగింది. 2021లో ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా దళాలు వైదొలిగిన తర్వాత పాకిస్తాన్‌తో ఒకప్పటి సంబంధాలు లేవు అని చెప్పుకొచ్చారు. ఇక, దీర్ఘశ్రేణి క్షిపణి టెక్నాలజీకి సంబంధించి అమెరికా ఆంక్షలు విధించిన జాబితాలో పాక్ ప్రభుత్వరంగానికి చెందిన నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్ (ఎన్‌డీసీ) కూడా ఉండటం గమనార్హం. దీంతోపాటు అక్తర్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అఫిలియేట్స్ ఇంటర్నేషనల్, రాక్‌సైడ్ ఎంటర్‌ప్రైజెస్ కూడా జాబితాలో ఉన్నాయి. ఈ మూడు కంపెనీలు కరాచీ కేంద్రంగా పని చేస్తున్నాయి. మరోవైపు.. తమ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించడంపై పాక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆంక్షలు కేవలం పక్షపాతంతో కూడుకున్నవే అని ఘాటు విమర్శలు చేసింది పాక్ ప్రభుత్వం. సైనికపరమైన అసమానతలను సృష్టిస్తే

## కళ తప్పిన రంగస్థలం

**ప్రభుత్వ ప్రోత్సాహం కరువు**

**జిల్లాలో 500 మందికి పైగా కళాకారులు**

**144 మంది కళాకారులకు మాత్రమే పింఛన్లు**

**అది కూడా వృద్ధాప్య పింఛన్లతో సమానంగా అందజేత**

అలనాడు నాటకాలు ప్రజల్లో విజ్ఞానం, మానసికోల్లాసంతో పాటు చైతన్యం తీసుకొచ్చేవి. ప్రేక్షకుల జీవితాల్లో ఒక భాగమై రంజింపజేసేవి. స్వాతంత్ర్యోద్యమంలో నాటకాలు కీలకపాత్ర పోషించి సమరోత్సాహానికి ఊపిరులూదాయి. మన జిల్లాలో నాటకాల స్థాయి నుంచే ఎన్టీఆర్, సావిత్రి, ఎస్వీఆర్ వంటివారు సినిమా రంగంలోకి వెళ్లి రాణించారు. క్రమక్రమంగా సినిమాలు నాటకాల స్థానాన్ని ఆక్రమించాయి. దాదాపుగా పాతికేళ్లుగా వాటి ప్రాభవం తరిగిపోతూ వస్తోంది. ఈ క్రమంలో రంగ స్థల కళాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాలు కూడా వీరిని చిన్నచూపు చూస్తున్నాయి.

గుడ్లవల్లేరు: ఏ పాత్రలోకైనా అవలీలగా పరకాయ ప్రవేశం చేసి.. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయి తమకు తామే సాటి అని నిరూపించుకున్న కళామ తల్లి ముద్దు బిడ్డలు మన జిల్లాలో ఎందరో ఉన్నారు. నాటక రంగ అభిమానుల హర్షధ్వానాలు, ఈలలు, వన్స్‌మోర్ గోలలే వారికి కోట్లాది రూపాయల పారితోషికాలుగా భావించి వారు నటించేవారు. ముచ్చట గొలిపే డ్రెస్సులు, ముఖానికి పంచ వన్నెల మేకప్‌లు, వేదిక మీదకు వెళ్లగానే ముఖంపై పడే ఫోకస్ లైట్లు, ఆ రంగుల ప్రపంచంలో తమ జీవితాల్ని హారతి కర్పూరంలో కరిగించుకుంటూ కళా సామ్రాట్లుగా ఆనాడు వెలుగొందిన అనేక మంది కళాకారులు నేడు బతుకు బండిని లాగలేక, బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిని ప్రభుత్వాలు ఆదుకోవటం లేదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ కార్యక్రమాలకు నాటకాల ప్రదర్శనలిచ్చేలా ప్రోత్సహించే వారు..




ప్రస్తుతం దీనిని ప్రభుత్వాలు పక్కన పెట్టేయటంతో ఆ రంగం వైపు ఎవరూ కనీసం ఆసక్తి కూడా చూపడం లేదు.

### పింఛన్ల విషయంలో..

ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్ల విషయంలోనూ వారికి అన్యాయమే జరుగుతోంది. నాటకాలతో పాటు డప్పు వాయిద్యాలు, సన్నాయి రాగాలతో కళల్ని బతికించే కళాకారులు జిల్లాలో 500 మంది వరకూ ఉన్నారు. అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారం కేవలం 144మంది మాత్రమే ప్రభుత్వ కళాకారుల పింఛన్లు పొందుతున్నారు. గతంలో వృద్ధాప్య పింఛన్లు ఒక్కొక్కరికీ రూ.500 ఉంటే.. కళాకారులకు మాత్రం నెలకు ఒక్కో కళాకారునికి రూ.1,500 ఇచ్చేవి. ఇప్పుడు వృద్ధాప్య పింఛన్‌తో సమానంగా రూ. 4వేలు మాత్రమే ఇస్తున్నారు. కళల కోసం సర్వస్వం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వృద్ధాప్యంలో మగ్గుతున్న కళాకారులు ఎందరో ఉన్నారు. వృద్ధ కళాకారులకు పింఛన్ల పంపిణీలో అయినా ప్రభుత్వం కనీస న్యాయం చేయాలని పలువురు కళాకారులు కోరుతున్నారు.

### సాంస్కృతిక శాఖకు నిధి ఉండేది..

వినాయక చవితి, ధనుర్మాసాల వంటి పండుగలకు నాటక రంగ కళాకారులు ప్రదర్శనలు వస్తూ బిజీగా ఉండేవారు. కానీ ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. గతంలో సాంస్కృతిక శాఖకు నిధి ఉండేది. దాని నుంచే గ్రామాల్లో నాటకాల ప్రదర్శనకు కొంత సొమ్ము తీసి కళాకారులను ప్రోత్సహించే వారు. అలాంటి వ్యవస్థ మళ్లీ తీసుకురావాలి.

## ఓవైపు చలి మరోవైపు ఆకలి

**ఆహార లేమి, ఆకాశాన్నంటుతున్న ధరలు**

**గంజి తాగి బతుకుతున్న పౌరులు**

**పునరావాస శిబిరాల్లో విపరీతమైన చలి**

శీతాకాలం.. అంటేనే భూమిమీద ఉత్తరార్ధ గోళానికి పండుగ వాతావరణం. ప్రపంచంలో మూడోవంతు జనాభా ఇప్పుడు హాలిడే సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఉత్తరార్ధగోళ చలి ప్రభావాన్ని నేరుగా చవిచూస్తే గాజా స్ట్రిప్ మాత్రం వేడుకలకు దూరంగా ఆకలితో పోరాటం చేస్తోంది. చుట్టూ ఉన్న ప్రపంచమంతా పండుగకు సిద్ధమవుతుంటే క్షిపణుల మోతలు, బాంబుల దాడులతో ధ్వంసమైన గాజా నిరాశ, ఆకలితో మరణపు అంచున ఒంటరిగా నిలబడింది. ఉత్తరార్ధ గోళంలోకి వచ్చిన శీతాకాలం గాజాలో మరింత విషాదాన్ని తెచ్చిపెట్టింది. చల్లని వాతావరణం, వర్షం గాజాలో నిరాశ్రయులైన 20 లక్షల మంది పాలస్తీనియన్ల జీవితాలను దుర్భర పరిస్థితుల్లోకి నెట్టింది. ఇప్పటికే పలుమార్లు భారీ వర్షం కురిసింది. నిర్వాసితుల గుడారాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి. కొన్ని కూలిపోయాయి. ఇది వేలాది నిరుపేద కుటుంబాలను మరింత కష్టాల్లోకి నెట్టింది. బాంబు దాడుల నుంచి తప్పించుకోవడానికి చాలా మంది ఇళ్ల నుంచి కేవలం కట్టుబట్టలతో బయటపడ్డారు. కొందరు శిథిలాల నుంచి బట్టలు తెచ్చుకున్నారు. కానీ అత్యధిక శాతం పాలస్తీనియన్లకు ఆ అవకాశం లేకుండాపోయింది. చలికాలం రావడంతో ఒంటిని వెచ్చగా ఉంచే సరైన దుస్తులులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం చెప్పులు కూడా కొనుక్కోలేని దుస్థితి.

### ఆకాశాన్నంటుతున్న ధరలు

ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం ఒక కొత్త గుడారం 1,000 డాలర్ల వరకు ఉంటుంది. ఒక తాత్కాలిక షెల్టర్ వందల డాలర్లు ఖర్చవుతుంది. ఒక కొత్త దుప్పటి 100 డాలర్ల వరకు ఉంటుంది. బట్టల ధరలు మరింత పెరిగిపోయాయి. ఒక లైట్ పైజామా ధర ఇప్పుడు 95 డాలర్లు. ఒక కోటు వంద డాలర్లు. ఒక జత బూట్లు 75 డాలర్లు. చలి కాచుకోవడానికి సరిపడా ఇంధనం లేదు. ఇక 8 కిలోల గ్యాస్ ధర 72 డాలర్లకు చేరుకుంది. కలప ధర కొంచెం తక్కువ. కానీ పునరావాస శిబిరాల్లో ఉన్న ఎవరి దగ్గరా అంత డబ్బు లేదు. విపరీతమైన డిమాండ్‌ను తీర్చడానికి గాజా అంతటా సెకండ్ హ్యాండ్ దుస్తుల మార్కెట్లు వెలిశాయి. అక్కడా ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

### ప్రబలుతున్న వ్యాధులు

వెచ్చగా ఉంచేందుకు బట్టలు, ఇంధనం లేకపోవడంతో శీతాకాలంలో జలుబు, ఫ్లూ, ఇతర వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇవి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. పోషకాహార లోపంతో బలహీనపడిన శరణార్థుల శరీరాలు విపరీతమైన భయం, బాంబుల గాయాలతో అలసిపోయాయి. అందుకే సాధారణ జలుబును కూడా వాళ్లు తట్టుకోలేక ఊరకనే జబ్బు పడుతున్నారు. ప్రస్తుతం



ఆసుపత్రులు కూడా అరకొరగా పనిచేస్తున్నాయి. బాంబు దాడిలో తీవ్రంగా గా యపడిన వారికి మాత్రమే వైద్యం అందుతోంది. ఔషధాలు, సిబ్బంది కొరతతో సాధారణ రోగాలకు వైద్యం అందించలేకపోతున్నాయి. పరిశుభ్రత దాదాపు అసాధ్యంగా మారడంతో వ్యాధులు వేగంగా ప్రబలుతున్నాయి. చలివాతారణంలో సరైన విద్యుత్, ఇతరత్రా వసతులు ఏక గుడారాల్లో నిర్వాసితులు సరిగా స్నానం చేయలేక తిప్పలు పడుతున్నారు. చివరకు చేతులు కూడా శుభ్రంగా కడుక్కోలేని దైన్యం వాళ్లది.

### అత్యంత విలాసం.. రొట్టె ముక్క

అక్టోబర్ నుంచి గాజాలోకి వచ్చే అంతర్జాతీయ మానవతా సహాయం కూడా చాలా తగ్గిపోయింది. గాజా స్ట్రిప్ మొత్తం వినాశకరమైన కరువును ఎదుర్కొంటోంది. డిమాండ్ పెరిగి సరకు రవాణా బాగా తగ్గిపోవడంతో ధరలు విపరీతంగా పైకి ఎగశాయి. ఒక బస్తా పిండి ధర ఇప్పుడు ఏకంగా 300 డాలర్లకు పైనే ఉంది. ఇతర ఆహార పదార్థాలు కూడా ప్రియమైపోయాయి. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వేట మాంసం, కోడి మాంసం కోరుకోవడం చాలా పెద్ద అత్యాశ కిందే లెక్క. ఒకప్పుడు కుటుంబాలకు జీవనాడి అయిన బేకరీలు ఇప్పుడు ముడి సరుకులు అందక మూతపడ్డాయి. ఒక రొట్టె దొరకడమే చాలా కష్టంగా మారింది. పిండి దొరికినా అది పురుగులమయం. ఒకవేళ పురుగులు లేకుంటే అప్పటికే అది ముక్కిపోయి ఉంటోంది. దీంతో ప్రజలు ఇప్పుడు తకాయా(ఛారిటీ సూప్ కిచెన్ల)పై ఆధారపడవలసి వస్తోంది. ఉదయం 11:00 గంటలకు ఇవి తెరిచే సమయానికి పంపిణీ కేంద్రాల ముందు జనం చాంతాడంత వరసల్లో క్యూ కడుతున్నారు. వేలాది మంది శరణార్థుల కుటుంబాలకు తమ పిల్లలను పోషించడానికి ఇవి తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు.

### భరించలేని మానసిక వేదన

ఆకలి శారీరక బాధే అయినా మానసిక వేదన అంతులేకుండా ఉంది. 2 లక్షలకు మందికి పైగా పిల్లలు పోషకాహార లేమితో బాధపడుతున్నారు. సరైన పౌష్టికాహారం లేక చిన్నారుల శరీరాలు ఎముకల గూడులాగా తయారయ్యాయి. వందలమంది చిన్నారులు సరైన తిండితిప్పలు లేక అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారు. పిల్లలకు సరైన తిండికూడా పెట్టలేకపోతున్నామన్న బాధ తల్లిదండ్రులను విపరీతంగా వేధిస్తోంది. ఆకలితో చచ్చిపోతున్న పిల్లలను చూసి నిస్సహాయంగా కుమిలిపోతున్నారు. కన్నపిల్లలు కడతేరిపోతుంటే కన్నవారి కష్టాలకు హద్దుల్లేకుండా పోయింది. అత్యంత క్రూరమైన ఈ పరిస్థితులను దూరం నుంచి చూస్తున్న పశ్చిమదేశాలు నిశ్శబ్దంగా ఉండటం మరింత దారుణం. భూతలంపై నడిమధ్యలోనే ఉన్నా చలి, ఆకలితో పాలస్తీనా సమాజం ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ మరణంకోసం ఎదురుచూస్తోంది.

## ట్రంప్ బెదిరింపు!





అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మరోసారి మనదేశాన్ని బెదిరించాడు. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్యపోరును ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మనదేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం

పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు.ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు,లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయల్కుట 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే

మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది.దప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్థం.

ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతున్నది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విభేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది. ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ 'అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు.అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు.మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగపరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్‌ఎఫ్‌ఏపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. అమెరికాకు అగ్రస్థానమే తన లక్ష్యం అని చెబుతున్న ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

## జెపిసికి జమిలి ఎన్నికల బిల్లు




న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ (వన్ నేషన్- వన్ ఎలక్షన్) బిల్లును శుక్రవారం లోక్‌సభ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపింది. సభను వాయిదా వేయడానికి ముందు జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను జెపిసికి సిఫార్సు చేసే తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. జెపిసి కమిటీలో 27 మంది లోక్‌సభ సభ్యులు కాగా, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. బిజెపికి చెందిన అనురాగ్ ఠాకూర్, పి.పి. చౌదరీలు, కాంగ్రెస్ నుండి ప్రియాంక గాంధీలు జాయింట్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. జెపిసికి 12మంది సభ్యులను ప్రతిపాదించే తీర్మానాన్ని వాయిస్ ఓటుతో రాజ్యసభ ఆమోదించింది. బిజెపి నుండి ఘన్‌శ్యామ్ తివారీ, భువనేశ్వర్ కలిత, డా.కె. లక్ష్మణ్, కవితా పాటిదార్, జెడి(యు) నుండి సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నుండి రణదీప్ సుర్జేవాలా, ముకుల్ వాస్నిక్, టిఎంసి నుండి సాకేత్ గోఖలే, డిఎంకె నుండి పి. విల్సన్, ఆప్ నుండి సంజయ్ సింగ్, బిజెడి నుండి మానస్ రంజన్ మంగరాజ్, వైఎస్ఆర్‌సిపి నుండి విజయ్ సాయి రెడ్డిలను రాజ్యసభ ప్రతిపాదించింది. జమిలి ఎన్నికలను అనుమతించే రెండు బిల్లులను మంగళవారం లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ నిర్మాణానికి విరుద్ధమని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జెపిసి)కి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

## పార్లమెంట్ ఉభయసభలు నిరవధిక వాయిదా



న్యూఢిల్లీ : బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలతో శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పార్లమెంట్ గేట్ల వద్ద నిరసనలు చేపట్టకూడదని అల్టిమేటం జారీ చేశారు. సభను వాయిదా వేసే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. శుక్రవారం ఉదయం కూడా పార్లమెంట్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసన చేపట్టారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విజయ్ చౌక్ వద్ద కూడా ప్రతిపక్ష ఎంపిలు ఆందోళనకు చేపట్టారు. జమిలి ఎన్నికల ముసాయిదాను జెపిసికి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను స్పీకర్ ఓం బిర్లా కోరారు. ఆ బిల్లును ప్రవేశ పెట్టిన తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీకి జమిలి ఎన్నికల బిల్లును పంపారు. ఆ తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనతో ఛైర్మన్ జగదీప్ దన్‌ఖర్ రాజ్యసభను నిరవధిక వాయిదా వేశారు.

## భారత్‌లోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచిన ఢిల్లీ



న్యూఢిల్లీ : భారత్‌లోనే అత్యంత కలుషిత నగరంగా దేశ రాజధాని ఢిల్లీ నిలిచినట్లు అధికారిక డేటా తెలిపింది. ఢిల్లీలో శుక్రవారం ఉదయం కూడా వాయు నాణ్యతా సూచీ (ఎక్యూఐ) పేలవమైన కేటగిరీలోనే కొనసాగింది. గత ఐదు రోజుల నుండి ఢిల్లీలో ఎక్యూఐ పేలవంగానే కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉదయం 24 గంటల సగటు వాయు నాణ్యతా సూచి 433గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) తెలిపింది. ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సూచించిన పరిమితి కన్నా 17 రెట్లు ఎక్కువగా ఉందని వెల్లడించింది. సిపిసిబి ప్రకారం.. ఢిల్లీలో పిఎం2.5 ( ప్రధాన కాలుష్య కారకం) స్థాయి గురువారం ఉదయం 8.00గంటలకు క్యూబిక్ మీటరుకు 255.3 మైక్రో గ్రాములుగా ఉంది. ఇది డబ్ల్యుహెచ్ఒ సూచించిన 15 మైక్రోగ్రాముల పరిమితి కన్నా 17.02 రెట్లు ఎక్కువ. ఈ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులతో పాటు ప్రజల్లో ఊపిరితిత్తుల వ్యాధులతో పాటు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌ను ఖండించిన ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌పై శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. దేశం మొత్తం చూస్తోందని, రాహుల్‌గాంధీపై ఇప్పటికే అనేక కేసులు పెట్టారు. అసత్యాలతో మరో కొత్త ఎఫ్ఐఆర్ తీసుకువచ్చారని అన్నారు. ఇది వారి నిస్సహాయ స్థితికి నిదర్శనమని అన్నారు. పార్లమెంటులో జరిగిన గొడవకు సంబంధించి ఢిల్లీ పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. రాహుల్‌పై కేసు ప్రధాన అంశం నుండి దృష్టి మళ్లించడమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పేర్కొన్నారు. హెూంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలను దారి మళ్లించే వ్యూహం తప్ప మరొకటి కాదని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ కేసు అంబేద్కర్ వారసత్వాన్ని కాపాడినందుకు రాహుల్‌కి దక్కిన గౌరవ చిహ్నమని (బ్యాడ్జ్ ఆఫ్ ఆనర్) అన్నారు. బిజెపి రాజకీయ కక్షతో ఇప్పటికే రాహుల్ 26 కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ తాజా ఎఫ్ఐఆర్ రాహుల్‌ను ఆర్ఎస్ఎస్-బిజెపి పాలనకు వ్యతిరేకంగా నిరోధించదని అన్నారు. తమపై భౌతిక దాడికి పాల్పడిన బిజెపి నేతలపై కాంగ్రెస్‌కు మహిళా ఎంపిలు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లపై మాత్రం ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఎత్తిచూపారు. మహిళా ఎంపిల ఎఫ్ఐఆర్‌లపై ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు.

# అణ్వస్త్ర ప్రమాదం



ప్రపంచవ్యాప్తంగా ఆయుధ పోటీ క్రమంగా పెరుగుతుండటం ఆందోళనకరం. ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన దీర్ఘకాలిక క్షిపణులు రష్యా భూభాగంపై ప్రయోగించేందుకు అనుమతిస్తూ అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఫర్మానా జారీచేయడంతో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ఆ వెనువెంటనే ఉక్రెయిన్ కొన్ని క్షిపణులను రష్యాపై వేసింది కూడా. దీన్ని అమెరికా ప్రత్యక్ష దాడిగా భావిస్తామని, అణ్వస్త్ర వినియోగ విధానంలో మార్పులు చేస్తామని రష్యా వెల్లడించడం ఓ ప్రమాదకరమైన మలుపు. దీంతో అణ్వస్త్ర ముప్పు మరోసారి తెరమీదకు వచ్చింది. అణ్వస్త్ర పరిమితి ఒప్పందాలను తాము ఖాతరు చేయబోమని, అవి కాలగర్భంలో కలిసిపోయినట్టేనని రష్యా సైనికదళాల ప్రధానాధికారి జనరల్ వాలెరీ గెరాసిమోవ్ తేల్చిచెప్పడం గమనార్హం. పాశ్చాత్య ప్రపంచంపై నమ్మకం సన్నగిల్లడమే ఇందుకు కారణమని ఆయన తేల్చి చెబుతున్నారు. 2002లో విధ్వంసక క్షిపణుల ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో అగ్రరాజ్యాల మధ్య ఆయుధ పోటీకి బీజం పడింది. అప్పటినుంచి ఒకదాని తర్వాత ఒకటిగా ఆయుధ పరిమితి ఒప్పందాలన్నీ కుప్పకూలుతూ వచ్చాయి. చివరగా మిగిలిన వ్యూహాత్మక ఆయుధ పరిమితి ఒప్పందం గడువు 2026 ఫిబ్రవరిలో ముగిసిపోతుంది. అంటే గత 50 సంవత్సరాల చరిత్రలో బడా అణ్వస్త్ర దేశాల మధ్య ఎలాంటి ఒప్పందాలు లేని పరిస్థితిని ప్రపంచం ఎదుర్కోబోతున్నది. రష్యా చేసిన ప్రకటనతో అది అంతకంటే ముందే జరిగిపోతుందేమోననే భయాలు వెంటాడుతున్నాయి. నేటిరోజుల్లో అణ్వస్త్ర సమస్య అనేది అమెరికా రష్యాలకే పరిమితం కాలేదు. చైనా కూడా ఆయుధపోటీలోకి దూకుడుగా దిగడంతో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. ఈ సరికే చైనా 500 అణ్వస్త్రాలు పోగేసుకున్నట్టు ఒక లెక్క. దశాబ్దం చివరి నాటికి ఆ సంఖ్యను వెయ్యికి, 2035 నాటికి అమెరికా, రష్యాలతో సమానంగా 1,500కు పెంచాలని చూస్తున్నది. దీనివల్ల అణ్వాయుధ పరిమితి చర్చల్లో పాల్గొనాల్సిన దేశాల సంఖ్య రెండు నుంచి మూడుకు పెరుగుతుంది. అణ్వస్త్రాల సమస్య భారత్ తలుపు తడుతున్న సూచనలూ కనిపిస్తున్నాయి. పొరుగున ఉన్న పాక్, చైనాలు ప్రకటిత అణ్వస్త్ర దేశాలు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా తిరుగుబాటు ఫలితంగా షేక్ హసీనా ప్రధాని పదవి కోల్పోయి దేశం వదిలి పారిపోయిన తర్వాత భారత వ్యతిరేక శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్‌లో షహీదుజ్జమాన్ అనే వివాదాస్పద ప్రొఫెసర్ బంగ్లా-పాక్ మధ్య అణ్వస్త్ర రక్షణ ఒప్పందం కుదిరితే బాగుంటుందని చేసిన సూచన సంచలనం కలిగించింది. సాధ్యాసాధ్యాల సంగతి అటుంచితే ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. అణుయుద్ధం ఎప్పుడు, ఎవరి మధ్యన జరిగినా విజేతలంటూ ఎవరూ మిగలరనేది నిర్వివాదాంశం. మూడు దశాబ్దాలుగా ఒప్పందాలు కలిగించిన భరోసా అంతమైపోతున్నది. 1962లో క్యూబా సంక్షోభం తర్వాత మళ్లీ అణ్వస్త్రాల ఉపయోగం గురించిన మాటలు వినవస్తున్నాయి. ఇది ఎటు దారితీస్తుంది!

# ప్రశ్నించడమూ తప్పేనా!



కడుపులో కత్తెర్లు నోట్ల శెక్కరలు అని పెద్దలు ఉత్తగనే అనలేదు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన తీరే అందుకు సజీవ సాక్ష్యం. ఎన్నికలకు ముందు హస్తం నేతలు తియ్యటి మాటలు చెప్పారు. తాము భూమ్మీద కాదు, మాట మీద నిలబడే మనుషులమని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు పీసీసీ అధ్యక్షుడి హెూదాలో రేవంత్‌రెడ్డి మరో గ్యారెంటీ కూడా ఇచ్చారు. అదే ప్రజాపాలనలో ఎవ్వరైనా ప్రశ్నించొచ్చని. కానీ, నేడు అవేవీ అమలు కావడం లేదు. కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనే అందుకు రుజువు. ప్రజాపాలనలో ప్రశ్నిస్తే కేసులే కేసులు. 'మాటలు మస్తుగ చెప్తం. కానీ, వాటిని అమలు చేస్తమా? హామీలు అమలు చేయాలని మమ్మల్నే ప్రశ్నిస్తారా? మీరు ప్రశ్నిస్తే మేం ఊరుకుంటమా?' అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలి. హస్తం ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతూ, ఇదేమిటని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై ఏడాదిలోనే సుమారు 90కి పైగా కేసులు నమోదయ్యాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి ఉమ్మడి ప్రభుత్వమూ ఇంతలా కేసులు పెట్టలేదు. అంతేకాదు, బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపిస్తామని పాలకులు బాహటంగా చెప్తున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రితో పోటీపడి మరీ మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మొన్నటివరకు ప్రజావిజయోత్సవాలు అంటూ హడావుడి చేసింది. కానీ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ప్రభుత్వాన్ని దూషించని రోజు లేదు. సమయం, సందర్భం లేకుండా విమర్శలు, ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. నాయకుల ఇండ్లలో చిన్న శుభకార్యం జరిగినా కూడా కేసులు పెట్టాలని చూస్తున్నారు. ఏదో సాకుతో ఇరుకునపెట్టి, ఇబ్బందుల పాల్జేయాలనేది ఈ ప్రభుత్వ కుట్రలా అనిపిస్తున్నది. అందులో భాగంగానే రైతుల పక్షాన మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులందరిపై కేసులు నమోదు చేశారు. మొన్నటివరకు హరీశ్‌రావుపై కేసులంటూ లీకులిచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌పై విచారణ అంటూ హంగామా చేస్తున్నారు. ఇక జైలుకు వెళ్లడం ఖాయమంటూ కాంగ్రెస్ నేతలు జోస్యం చెప్తున్నారు. వారిట్లా చెప్పడం పోలీసులు కేసులు నమోదు చేయడం వెంటవెంటనే జరిగిపోతున్నాయి. తమది ప్రజాపాలన అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా రాజ్యాంగస్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నారు. పైగా నిత్యం నీతులు చెప్తున్నారు. ఆర్టికల్ 19 ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛ బహిరంగంగా ఉల్లంఘనలకు గురవుతూనే ఉన్నది. అంతేకాదు, ఆర్టికల్ 14 కూడా దుర్వినియోగం అవుతున్నది. గౌరవంగా, భద్రంగా జీవించే హక్కును మన రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించింది. అయినప్పటికీ, హైడ్రా పేరుతో ప్రజల ఆస్తులను ధ్వంసం చేశారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే ఇలా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి? ఆర్టికల్ 21 ప్రసాదించిన జీవించే హక్కును కూడా కాలరాశారు. లగచర్ల ఘటనే అందుకు నిదర్శనం. ఓటేసిన పాపానికి తాము ఇన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బతకాల్సి వస్తోందని అక్కడి ప్రజలు మీడియా ముఖంగానే చెప్పిన విషయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉన్నది. ఇక ఈ ఏడాది పాలనలో ప్రభుత్వ పెద్దలు మాట్లాడిన భాష గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దుర్భాషా దుర్గంధాన్ని తెలంగాణ ప్రజలు భరిస్తున్నారనే విషయం తేటతెల్లం అయింది. కండ్లు పీకుత, కడుపుల పేగులు తీస్త, కనుగుడ్లతో గోటీలాడుకుంట.. ఈ తరహా భాష సచివుల నోటి నుంచి వచ్చింది. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కంటే విపక్షంపై దుమ్మెత్తిపోయడమే ప్రధాన ఎజెండాగా ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నది. అందుకే సమయం, సందర్భం లేకుండా గత ప్రభుత్వ పెద్దలపై దుమ్మెత్తిపోస్తున్నారు. వారి వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూస్తున్నారు. మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కార్ చేసిన అప్పులు లక్ష కోట్లను మించిపోయాయి. ఇప్పటివరకు ఒక్క కొత్త పథకమూ ప్రకటించలేదు. పాత వాటికి నిధులు కేటాయించడం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా వందల కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి మీడియాలో ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు. తమ డబ్బా తామే కొట్టుకుంటున్నారు. అంతేతప్ప, పేదల గురించి పాలకులకు సోయి లేదు. ఈ పాలనలో తెలంగాణ సోయి లేదు. తెలంగాణ ఆత్మ లేదు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఇసుమంత కూడా లేదని ప్రజలు బాహాటంగా చెప్తున్నారు. కరెంటు, నీళ్లు, ఎరువులు, విత్తనాలు, రైతులకు మద్దతు ధర తదితర అంశాల్లో గడిచిన పదేళ్లలో వచ్చిన మార్పును ప్రజలు గమనించారు. ప్రభుత్వం మారగానే మళ్లీ తమకు మునుపటి కష్టాలు వస్తున్నాయని వేదన చెందుతున్నారు. ప్రజాపాలన అని చెప్తున్నారు కానీ, అక్కడ ప్రజలు లేరు, ప్రజల అభీష్టం అసలే లేదు. కేవలం తామే అన్న రీతిలో జరుగుతున్న పాలన ఉందనేది ప్రజల అనుభవం చెప్తున్న విషయం. మొత్తంగా చెప్పాలంటే కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర్యపు హక్కు హరించబడుతున్నాయని మాత్రం చెప్పక తప్పదు.

# చర్చ అంటే భయమెందుకు?



ఫార్ములా- ఈ రేస్ విషయంలో తనపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరైన సందర్భంలో, సరైన రీతిలో స్పందించారు. స్పందించడమే కాదు, ఏకంగా చర్చ పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాసి విజ్ఞప్తి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత ఇరుకున పెట్టారు. అంతేకాదు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి, సభలోనే చర్చ పెట్టాలని సీఎం రేవంత్‌కు బహిరంగంగా సవాల్ విసరడం మరో డేరింగ్ స్టెప్. బహుశా కేటీఆర్ నుంచి ఇలాంటి సవాల్ వస్తుందని కాంగ్రెస్ పార్టీ గాని, రేవంత్‌రెడ్డి అండ్ కోటరీ గాని ఊహించలేదేమో. కేటీఆర్ సవాల్‌తో ఇప్పుడు కాంగ్రెస్‌లో కొత్త టెన్షన్ మొదలైంది. అసలే ఏడాదిగా అధికార పార్టీ అనేక ఇబ్బందులు పడుతోంది. ప్రభుత్వ వ్యూహాలన్నీ బూమరాంగ్ అవుతున్నాయి. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడంలో అధికార కాంగ్రెస్ విఫలమవుతోంది. ఇదెవరో గాలినపోయే గన్నారావు చెబుతున్న మాటలు కావు, ఏకంగా తెలంగాణలో ఏఐసీసీ ఇన్‌చార్జ్, హైకమాండ్ దూత అయిన దీపాదాస్ మున్షీ అనేక సందర్భాల్లో చెప్పిన మాటలివి. నిన్నటికి నిన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పరిస్థితి మరీ దయనీయంగా ఉందని.. కేటీఆర్, హరీశ్‌రావును దీటుగా ఎదుర్కొనే నాయకుడు కాంగ్రెస్‌లో లేదని ఆమె కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అంతేకాదు, హైదరాబాద్ ప్రజలను, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడారు. అది వేరే సంగతి. అంతకుముందు ఢిల్లీ నుంచి వచ్చి రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ ఎ లా వెనుకబడి పోతోందో వర్క్‌షాప్ పెట్టి మరీ చెప్పారు. ప్రజల దృష్టిలో విపక్షాలను విలన్లుగా, విఫల నేతలుగా చిత్రీకరించే ప్రయత్నంలో అధికార పార్టీ నేతలే విలన్లుగా మిగిలిపోతున్నారు. ఈ అంశం, ఆ అంశం అన్న తేడా లేకుండా ప్రతి విషయంలోనూ అధికార పార్టీపై ప్రతిపక్షం పైచెయ్యి సాధిస్తోంది. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకున్నది. కానీ, జరుగుతున్న పరిణామాలు గమనిస్తే మళ్లీ ఆ పార్టీకి చుక్కెదురు అవుతుందనిపిస్తోంది. కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల అంశంలో కేసీఆర్‌ను టార్గెట్ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఫార్ములా-ఈ రేస్ విషయంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని చేతులు కాల్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఫార్ములా- ఈ రేస్‌లో అవినీతి జరిగిందని, అందులో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని ఎప్పటినుంచో కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. లీక్ వార్తలతో ప్రాపగాండా చేస్తోంది. ఇదిగో కేటీఆర్ అరెస్టు, అదిగో అంటూ కొన్ని నెలలుగా పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఆనవాళ్లు లేకుండా చేస్తానని, కేసీఆర్ గుర్తులు లేకుండా చేస్తానని రేవంత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలోనే మొదటి ఏడాది గత ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గర చేసిన పథకాలపై విష ప్రచారం, తప్పుడు ఆరోపణలు చేసి అరెస్టులంటూ ఊదరగొట్టారు. ఆ ప్రయత్నాలన్నీ బూమరాంగ్ కావడమే కాదు, మళ్లీ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు బలంగా కోరుకునేలా చేశాయి. ఇప్పుడేమో పర్సనల్‌గా కేటీఆర్‌ను టార్గెట్ చేశారు. అయితే తాజాగా ఫార్ములా- ఈ రేస్ కేసు విషయమై కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం, మంత్రులపై ఇంటాబయట కేటీఆర్ పోరు ఎక్కువైంది. ఆ ఫ్రస్టేషన్ ముఖ్యమంత్రి, మంత్రులు మాటల్లో అనేక సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. ఒకవైపు ఇంటి పోరు, మరోవైపు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయాలని ప్రజల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మధ్య ప్రభుత్వ పెద్దలు కొట్టుమిట్టాడుతున్నారు. ఫ్రస్టేషన్‌లో మనిషి విచక్షణ కోల్పోయి మాట్లాడతాడని, ఎప్పుడూ ఏ నిర్ణయం తీసుకుంటారో.. సమయం, సందర్భం లేకుండా వారి వ్యవహారశైలి ఉంటుందని సైకాలజిస్టులు చెబుతుంటారు. ముఖ్యమంత్రి, మంత్రులు కూడా మనుషులే కదా. ఫార్ములా- ఈ రేస్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, అధికారుల పాత్ర కూడా ఏమీ లేదని, తానే స్వయంగా తన మంత్రిత్వ శాఖ నుంచి నగదును నిర్వాహకులకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు కేటీఆర్ పలుమార్లు చెప్పారు. ఇందులో ఎలాంటి తప్పు జరగలేదని కేటీఆర్ చాలా సందర్భాల్లో స్పష్టం చేశారు. అయితే, తాజాగా కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ, విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ల పేరుతో కాంగ్రెస్ మొదటి ఏడాది కాలం వెళ్లదీసింది. ఒట్లు, తిట్లు, బూతులతో పాలనను గాలికొదిలేశారు. ఇప్పుడు ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ చుట్టూ రాజకీయాలు తిప్పుతూ రెండో ఏడాది కూడా గ్యారెంటీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీసే వ్యూహాల్లో అధికార పార్టీ నేతలు ఉన్నారు. ఫార్ములా-ఈ రేస్ విషయంలో ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై కేటీఆర్ మొదటి నుంచి సవాల్ విసురుతూనే ఉన్నారు. లీక్ వార్తలతో కేటీఆర్‌ను భయపెట్టేందుకు సర్కారు ఎంత కఠినంగా వ్యవహరించాలని చూస్తుందో అంతే కఠినంగా తప్పు చేస్తే అరెస్టు చేసుకోవాలని కేటీఆర్ ధైర్యంగా సవాల్ చేస్తున్నారు. తాజాగా కేసుకు ముందే దమ్ముంటే అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా- ఈ రేస్‌పై చర్చ పెట్టాలని ఏకంగా స్పీకర్‌కు, సీఎంకు లేఖ రాసి అధికార పార్టీని కేటీఆర్ ఇరుకున పెట్టారు. ఈ క్రమంలో అధికార పార్టీని డిఫెన్స్‌లో పడేశారు. కేటీఆర్ డిమాండ్ చేసినట్టు సభలో చర్చ పెడితే వాస్తవాలు తెలంగాణ సమాజానికి తెలుస్తాయి. ఒకవేళ సభలో చర్చకు పెట్టకపోతే ఇన్ని రోజులు కేటీఆర్‌పై ప్రభుత్వం చేసిందంతా తప్పుడు ప్రచారం అని జనాలకు అర్థమైపోతుంది. అందుకే, అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయంలో కేటీఆర్‌పై కేసు పెట్టించి, లగచర్ల రైతుల విడుదల విషయం మీడియాలో ప్రచారానికి నోచుకోకుండా మరో డైవర్షన్ ఎత్తుగడకు కాంగ్రెస్ సర్కార్ పాల్పడింది.

## పెట్రోల్ బంకులో భారీ అగ్నిప్రమాదం..ఆరుగురు మృతి



హైదరాబాద్: రాజస్థాన్ లోని జైపుర్‌లో ఓ పెట్రోల్ బంకులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కనీసం ఆరుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు జైపుర్-అజ్మీర్ హైవేపై ఎల్పీజీ ట్యాంకర్ ను, ఓ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి దగ్గర ఉన్న పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. ఆ సమయంలో బంకు వద్ద ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. 37 మంది గాయపడ్డారు. ఈ సమచారం అందుకున్న వెంటనే 20 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బంకు నుంచి పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ట్యాంకర్ ను ఢీకొట్టిన ట్రక్కులో మండే రసాయనాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సైతం ఆసుపత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది.

## కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కీలక ప్రకటన




హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుండి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కుటుంబాలు వేరు పడిన వారు, కొత్తగా పెండ్లిళ్లు చేసుకున్నవారు రేషన్ కార్డుల కోసం ఎంతో ఆశగా చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగనే రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ప్రజా పాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇప్పటి వరకు రేషన్ కార్డులు ఇవ్వలేదు. దీంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల మంజూరుపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి తర్వాత తెలంగాణలో అర్హులకు కొత్త తెల్ల రేషన్‌కార్డులు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రేషన్‌కార్డులతోపాటు పేదలకు దొడ్డు బియ్యం బదులు సన్నబియ్యం ఇవ్వాలని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లోనే సన్నబియ్యం పంపిణీని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం అక్రమ వ్యాపారాన్ని నివారించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం తూకాల్లో తేడాలు నివారించేందుకే వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థను రద్దు చేసి, లబ్ధిదారులకు సరాసరి డబ్బు చెల్లించే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. నిత్యావసరాలను పేదల ఇంటికే డెలివరీ చేసే యోచన ప్రస్తుతానికి లేదన్నారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రేషన్ డీలర్లకు బీమా సౌకర్యం కల్పనపై కూడా ఆలోచిస్తామన్నారు. కాగా, అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని వారికి మాత్రమే రేషన్ కార్డులు ఇస్తామన్నారు. రేషన్ కార్డుల అందజేతకు విధి విధానాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు పక్కాగా అందాలనేదే తమ ప్రభుత్వ విధానమని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## విద్యార్థులకు గుడ్ న్యూస్ ..
## స్కూళ్లకు 15 రోజుల సెలవులు


హైదరాబాద్:శీతాకాలం సందర్భంగా దేశవ్యాపత్ంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు దారుణంగా



పడిపోయి.. చలితీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒక్కో రాష్ట్రంలో 15 రోజుల పాటు పాఠశాలలను మూసివేయనున్నారు. ఏ రాష్ట్రంలో ఎప్పుడెప్పుడు, ఎన్ని రోజులు స్కూళ్లకు సెలవులు ఉండనున్నాయంటే. దేశ రాజధాని ఢిల్లీలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఢిల్లీలోని అన్ని స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ.. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 15 రోజులతోపాటు ఈనెల 25వ తేదీన క్రిస్మస్ పండగ సందర్భంగా ఆరోజు కూడా సెలవు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్కూళ్లకు సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించారు. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శీతాకాల సెలవులు.. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే ఆ తర్వాత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. సెలవులను పొడిగించాలా వద్దా అనేది అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. శీతాకాల సెలవులకు సంబంధించి హర్యానా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల పాటు హర్యానాలో చలి గాలుల తీవ్రత పెరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. గతేడాది శీతాకాలం సందర్భంగా జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రకటించారు.జమ్మూ కాశ్మీర్ పాఠశాల విద్యా శాఖ.. కాశ్మీర్ లోయతోపాటు జమ్మూ డివిజన్‌లోని పాఠశాలలకు శీతాకాల సెలవులను ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్‌లోని 5వ తరగతి వరకు పాఠశాలలు డిసెంబర్ 10 నుంచి ఇచ్చారు. అంతేకాకుండా 6 నుంచి 12వ తరగతుల వరకు డిసెంబర్ 16 నుంచి పాఠశాలలు మూసివేశారు. అయితే ఈ స్కూళ్లకు శీతాకాల సెలవులు ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో శీతాకాలంలో నిత్యం మంచు కురుస్తుంది కాబట్టి అక్కడి ప్రభుత్వం.. ఈ సమయంలో ఎక్కువగా స్కూళ్లకు హాలిడేస్ ఇస్తుంది.

## హైదరాబాద్‌లో 100 అడుగుల
## ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం

హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు,



విశ్వవిఖ్యాత నటసార్వభౌములు నందమూరి తారక రామారావు 100 అడుగుల విగ్రహం ప్రతిష్టాపనకు, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వపరంగా స్థలం కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గురువారం ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ సభ్యులు మధుసూదనరాజు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గత ఏడాదిన్నరకాలంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేపట్టిన కార్యక్రమాలను ముఖ్యమంత్రికి జనార్ధన్ వివరించారు.హైదరాబాద్‌లో 100 అడుగుల ఎత్తుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పాలన్న తమ సంకల్పాన్ని తెలియజేశారు. దాంతో పాటు ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, ఓ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇందుకు గాను తెలంగాణ ప్రభుత్వం తరపున స్థలాన్ని కేటాయించి సహకరించాలని జనార్ధన్, నందమూరి మోహనకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొని రేవంత్‌రెడ్డి అభినందించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజలందరికీ ఇష్టమైన నటుడు, నాయకుడని ఆయన 100 అడుగుల విగ్రహం హైదరాబాద్‌లో ప్రతిష్టించాలన్న ప్రతిపాదనకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి సానుకూల స్పందనకు ఎన్టీఆర్ అభిమానులందరూ సంతోషిస్తారని పేర్కొంటూ ఆయనకి ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ తరపున జనార్ధన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# మీకు తెలిసే జీవోలు వచ్చాయా ?

### సోమేష్, స్మితలకు ఘోష్ కమిషన్ ప్రశ్నలు
### కాళేశ్వరంపై కొనసాగుతున్న విచారణ



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ డిజైన్ల లోపాలు, అవినీతి ఆరోపణలపై నిజాలు నిగ్గు తేలే సమయం ఆసన్నమైంది. ఈ ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ముగింపు దశకు చేరుకున్నది. గత ఆరు మాసాల్లో విడతల వారీగా ప్రాజెక్టు నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్పొరేషన్ చైర్మెన్లు, గుత్తేదార్లను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్, బహిరంగ విచారణలో కీలక అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇప్పటికే తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై చర్యలు తప్పవని స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చిన ఆ కమిషన్ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ లోపాలు, ఆర్థిక అవకతవకలపై గత ప్రభుత్వ హయాంలో ఉన్నత హోదాలో పని చేసిన కీలక అధికారులను ప్రశ్నిస్తున్నది. ఇందులో భాగంగా గురువారం అప్పట్లో సీఎంవోలో కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన ఐఏఎస్ స్మితా సబర్వాల్ , మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్మితా సబర్వాల్ సీఎంవోలో కీలకంగా వ్యవహరించగా, సోమేశ్‌కుమార్ సీఎస్‌గా విధులు నిర్వర్తించిన విషయం తెలిసిందే.స్మితా సబర్వాల్‌ను ప్రశ్నించిన కమిషన్ క్యాబినెట్ ఆమోదం లేకుండానే మూడు బ్యారేజీలకు పరిపాలన అనుమతులు ఇచ్చారా ? అని వివరాలు రాబట్టే ప్రయత్నం చేసింది. కమిషన్ అడిగిన ప్రశ్నలకు స్పందించిన స్మితా సబర్వాల్ ఆ విషయం తనకు తెలియదనీ, అవగాహన లేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎంవోకి వచ్చే ప్రతి ఫైల్‌కు సీఎం ఆమోదం ఉంటుందన్న ఆమె, అందులో తాను ఏడు శాఖలను పర్యవేక్షించానని వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నా పరిధి పరిమితమే అన్న స్మిత సాధారణం సమన్వయాన్ని మాత్రమే చూసుకున్నట్టు తెలిపారని కమిషన్ తెలిపింది. మరోవైపు మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను ప్రశ్నించిన కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్, సోమేశ్ ఇచ్చిన వివరణపై తీవ్రంగా మండిపడ్డారు. బహిరంగ విచారణకు కోర్టు హాల్లోకి పిలిచిన వెంటనే రాకపోవడంతో సోమేశ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకూ స్మితా సబర్వాల్‌ను అడిగిన ప్రశ్నలూ అడగ్గా, తాను బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజీల నిర్మాణం పూర్తయిందని సోమేశ్ కుమార్ బదులిచ్చారు. వాటి అనుమతులు, క్యాబినెట్ తీర్మానాల గురించి తనకు తెలియదన్నారు. ఇతర శాఖల గురించి ఆయన ప్రస్తావించగా కేవలం బ్యారేజ్‌ల గురించి మాత్రమే చెప్పాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించింది.

#### త్వరలో హరీశ్‌రావు వంతు..!

ఈ నెల 18న విచారణను ఎదుర్కొన్న మాజీ సీఎస్ ఎస్కే జోషి , మాజీ ఐఏఎస్ రజత్ కుమార్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల విషయంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకుంది మాజీ సీఎం కేసీఆర్ , అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అని కమిషన్‌కు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన వ్యాప్కోస్ , సీఈ-సీడీవో ,ఇంజినీర్లతో జరిగిన సమావేశంలో వారే ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2016 మే 2న మేడిగడ్డ వద్ద భూమి పూజ చేసి బ్యారేజీల నిర్మాణాలను కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు. అదే రోజు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్ పేరును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చేశారని కమిషన్‌కు వివరించారు. ఆయా అధికారులు ఇచ్చిన వివరణతో గత ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా కాళేశ్వరం నిర్మాణ సమయంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా వ్యవహరించిన హరీశ్‌రావును ప్రశ్నించేందుకు కమిషన్ రంగం సిద్ధం చేసుకుంటున్నదనే ప్రచారం జరుగుతున్నది.

# సర్వేయర్లను నియమిస్తాం

### ఫారెస్టు, రెవెన్యూ సరిహద్దుల సమస్యలను పరిష్కరిస్తాం
### 30 నుంచి 35 నియోజకవర్గాల్లో సమస్య : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో భూముల సరిహద్దుల సమస్యను పరిష్కరించేందుకు సరిపడ సర్వేయర్లు లేరనీ, మండలానికి అవసరాన్ని బట్టి ఒకరిద్దరు సర్వేయర్లను నియమిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య సరిహద్దుల సమస్య, పోడు భూముల సమస్య 30 నుంచి 35 నియోజకవర్గాల్లో ఉందని మంత్రి చెప్పారు. పోడుభూముల సమస్యను పరిష్కరించేం దుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అయితే, సభ్యులు లెటర్‌హెడ్‌మీద రాసి ఇస్తే వాటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో 892 సర్వేయర్లకు గానూ కేవలం 242 మాత్రమే ఉన్నారని చెప్పారు. వీలైనంత త్వరలో సర్వేయర్లను నియమిస్తామన్నారు. ధరణి సమస్యల విషయంలో సభ్యులు చెప్పినవన్నీ నగ సత్యాలేనన్నారు. ధరణిని ప్రక్షాళన చేసేందుకే భూ భారతిని తీసుకొస్తున్నామని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను సరిదిద్దుతామన్నారు. ఓఆర్‌సీలను పరిష్కరిస్తామనీ, బోగస్ వాటిని నిర్మోహమాటంగా తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల రక్షణకు కృషిచేస్తామని హామీనిచ్చారు.

#### మాయల ఫకీర్ ఆడించినట్టు ధరణి ఆడింది
#### హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలి : పాయల్ శంకర్

మాయల ఫకీర్ ఆడించినట్టు ధరణి ఆడిందని కేసీఆర్‌నుద్దేశించి బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ వ్యాఖ్యానించారు. రైతులు తమ సొంత భూమిని కూడా అమ్ముకోలేని పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. నిషేధిత జాబితాలో చాలామంది రైతుల భూములను పెట్టిందన్నారు. ఓ ఎమ్మార్వో వందల కోట్ల ఆస్తులు సంపాదించుకుని పట్టుబడ్డారని గుర్తుచేశారు. అనేక లిటికేషన్లు పెట్టి కోట్లాది రూపాయల భూములను లక్షల రూపాయలకే అమ్ముకునేలా చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములున్నాయనీ, వాటిని ప్రస్తుత సర్కారు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దావాలు వేయడానికి వీలు లేదనే నిబంధన ఎత్తేయాలని విన్నవించారు. అసైన్డ్ భూములను వారసులకు ఇచ్చేలా అవకాశం కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1970 కంటే ముందు నుంచి సాగుచేసుకుంటున్న నాన్‌ట్రైబల్స్‌కు పట్టాలివ్వాలని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ కోరారు.

#### పోడురైతుల శాపనార్థాలతోనే గత ప్రభుత్వం కూలింది : పాల్వాయి హరీశ్‌బాబు

పోడురైతుల శాపనార్థాలతోనే గత ప్రభుత్వం కూలిందని బీఆర్ఎస్ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పోడు సాగుదారులపై అక్రమంగా పెట్టిన కేసులను ఈ ప్రభుత్వమైనా ఎత్తేయాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో కొండపల్లిలో 20 ఏండ్ల కింద 2000 ఎకరాలకు సంబంధించి పేదలకు అసైన్డ్ పట్టాలిచ్చారనీ, అవి ప్రభుత్వ భూములని గత ప్రభుత్వం రైతులను వేధించిందని విమర్శించారు. అక్కడ చెట్లు కూడా నాటించారని తెలిపారు.

#### సర్వే చేసి ఫారెస్టు-రెవెన్యూ భూముల లెక్క తేల్చాలి : మదన్‌మోహన్‌రావు

కాంగ్రెస్ సభ్యులు మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ..గిరిజనులు ఇండ్లు కట్టుకునేందుకు, బోర్లు వేసుకునేందుకు కూడా అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని వాపోయారు. రెవెన్యూ భూములేవి? అటవీ భూములేవి? సరిహద్దులెలా ఉన్నాయి? అనే అంశాలను సర్వే చేసి తేల్చాలని కోరారు.

#### 60,70 ఏండ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూముల నుంచి వెళ్లగొట్టడమేంటి? : బాలూనాయక్

దేవరకొండ నియోజకవర్గంలో 60,70 ఏండ్ల నుంచి గిరిజన రైతులు సాగుచేసుకుంటున్న భూముల నుంచి అటవీశాఖ వెళ్లగొట్టడమేంటని కాంగ్రెస్ సభ్యులు బాలూనాయక్ ప్రశ్నించారు. కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. శ్మశానవాటికలు, పల్లెప్రకృతివనాలు, డంపింగ్ యార్డుల పేరుతో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను గత ప్రభుత్వం లాక్కున్నదని విమర్శించారు. వాటిని తిరిగి పేదలకు ఇప్పించాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు మురళీనాయక్ మాట్లాడుతూ..గిరిజన రైతులకు కరెంటు సౌకర్యం కూడా ఇవ్వడంలేదని ప్రస్తావించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ..తన నియో జకవర్గంలో తమిళనాడు, కర్నాటక సరిహద్దుల్లో భూముల విషయంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయనీ, సర్వే చేసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# రూపాయి చారిత్రాత్మక పతనం



న్యూఢిల్లీ : తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువను పడిపోనివ్వబోమని.. అమాంతం పెంచుతామని..రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార ఆర్భాటాలు బొక్కబోర్లా పడ్డాయని మరోసారి నిరూపణ అయ్యింది. రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పతనమై 85.08కి దిగజారింది. రూపాయి విలువ 85 ఎగువకు పడిపోవడం భారత చరిత్రలోనే తొలిసారి. ఇంటర్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో ఉదయం 85 వద్ద ప్రారంభమైంది. ఇంతక్రితం సెషన్‌లోనూ 3 పైసలు కోల్పోయి 84.94 వద్ద ముగిసింది.

ప్రస్తుత ఏడాది నవంబర్‌లో అయితే రూపాయి విలువ అత్యంత పేలవంగా నమోదయ్యింది. ఈ ఒక్క నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. గత కొన్ని రోజులుగా రూపాయి విలువ ఏ మాత్రం పుంజుకోకపోవడంతో ఆర్బీఐ వద్ద ఉన్న విదేశీ మారకం నిల్వలు భారీగా కరిగిపోతున్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉంది. అప్పటి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రూపాయి బలోపేతానికి మోడీ చేసిన ప్రగల్భాలకు ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. రూపాయి నష్టాన్ని అరికట్టలేకపోతున్నారని స్పష్టమవుతోంది.

#### మరింత పడొచ్చు..

ఇటీవల అమెరికా ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ మరింత పెరగడం, భారత మార్కెట్ల నుంచి భారీగా విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో గడిచిన ఎనిమిది నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి విలువ పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో డాలర్‌కు మరింత విలువ పెరిగింది. దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనమూ రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. దిగుమతులు పెరగడం, ఎగుమతులు తగ్గడంతో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు, మందగించిన భారత జిడిపి తదితర ప్రతికూలాంశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. రూపాయి మారకం తీరు ఇంకా ఒత్తిడిలోనే ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిరంతర భౌగోళిక అనిశ్చితులు, దేశీయ సవాళ్లతో రూపాయి మరింత బలహీనతను చూడవచ్చని భావిస్తున్నారు. అదే జరిగితే భారత దిగుమతులు మరింత భారం కానున్నాయి. దిగుమతి ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ప్రభుత్వ రుణ, వడ్డీ చెల్లింపులు మరింత భారం అవుతాయి. ఈ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాళ్లను సృష్టించనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# స్టన్నింగ్ లుక్ లో వైష్ణవి.. వేరే లెవెల్ అంతే!



వైష్ణవి అంధలే.. ఎవరీ బ్యూటీ అనుకుంటున్నారా? సోషల్ మీడియా యూజర్స్ లో అనేక మందికి ఆమె తెలిసే ఉంటుంది. ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫిక్స్ తో సందడి చేసే ఆ మరాఠీ ముద్దుగుమ్మ.. స్టార్ హీరోయిన్ అవ్వాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. వచ్చిన అవకాశాలను అందుకుంటూ సత్తా చాటుతోంది వైష్ణవి. అయితే ముంబైకు చెందిన మల్టీ టాలెంటెడ్ వైష్ణవి.. మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత ఓవైపు షార్ట్ ఫిల్మ్స్.. మరోవైపు కమర్షియల్ యాడ్స్ లో కనిపించి మెప్పించింది. 2019లో మిస్ ఇండియా మహారాష్ట్ర కిరీటాన్ని గెలుచుకున్న ఆమె.. ఒక్కసారిగా అందరిని దృష్టిని ఆకర్షించింది. ఫెమినా మిస్ ఇండియా పోటీలో వెస్ట్ జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన వైష్ణవి.. రెండు అవార్డులను గెలుచుకోవడం విశేషం. మిస్ ఫోటో జెనిక్, మిస్ బ్యూటిఫుల్ హెయిర్ క్యాటగిరీస్ లో సత్తా చాటిన ఆమె.. దేశంలోని టాప్ 12 మోడల్స్ లో ఒకరు. అదే సమయంలో లాయర్ గా పట్టా అందుకుని అన్ని రంగాల్లో తోపేనని ప్రూవ్ చేసుకుంది! అయితే వైష్ణవి అటు యాక్టింగ్ పై ఫోకస్ పెడుతూనే.. ఇటు సోషల్ మీడియాలో బిజీగా ఉంటోంది. మంచి టాలెంట్ ఉన్న ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ అయిన ఆమె.. యూట్యూబ్ ఛానెల్ ను మెయింటైన్ చేస్తోంది. అలా లాయర్, యాక్టర్, యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అయిన వైష్ణవి మల్టీ టాలెంటెడ్. అదే సమయంలో నెట్టింట అందాలను ఆరబోస్తూ ట్రెండ్ లో ఉంటోంది వైష్ణవి. కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తూ మాయ చేసే ఆమె.. డైలీ తన సోషల్ మీడియా వాల్ చెక్ చేయాలనే సందడి చేస్తుంటోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ కు కేరాఫ్ అడ్రెస్ ఆమె! తాజాగా స్పెషల్ డ్రెస్ లో దిగిన కొత్త పిక్స్ షేర్ చేసి.. క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది అమ్మడు. వైట్ కలర్ సూట్ వేసుకున్న ముద్దుగుమ్మ.. తన స్కిన్ షోతో మైండ్ బ్లాక్ చేసిందనే చెప్పాలి. ఒక్క పిక్ లో వేరే లెవెల్ పోజ్ ఇచ్చి ఫ్లాట్ చేస్తోంది. ప్రస్తుతం వైష్ణవి స్టన్నింగ్ పిక్స్.. తెగ చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడు సూపర్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. స్టార్ హీరోయిన్ గా ఎదగాలని కోరుకుంటున్నట్లు చెబుతున్నారు.




# రష్మిక రాజీ పడేదేలే..!

కన్నడ భామ రష్మిక మందన్న ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్ లో పాపులారిటీ తెచ్చుకుంది. మనలో టాలెంట్ ఉంటే అది ఎప్పటికైనా సరే తెచ్చుకోవాల్సిన గుర్తింపు తెచ్చుకునేలా చేస్తుంది అని రష్మికని చూస్తే అర్థమవుతుంది. కన్నడలో కిరిక్ పార్టీతో పాపులర్ అయిన అమ్మడు తెలుగులో ఛలో సినిమాతో సూపర్ ఎంట్రీ ఇచ్చింది. ఇక అక్కడి నుంచి రష్మిక కెరీర్ దూసుకెళ్లింది. తెలుగు లో స్టార్ డం కొనసాగిస్తూనే బాలీవుడ్ ఆఫర్లు అందుకుంది. యానిమల్, పుష్ప 2 సినిమాల హిట్ తో పాన్ ఇండియా హీరోయిన్ గా సత్తా చాటుతుంది. ఇక ఇప్పుడు రష్మిక ఉంటే చాలు సినిమా సూపర్ హిట్టే అనే రేంజ్ కి వెళ్లింది. ఈ క్రమంలోనే రష్మికకు వరుస అవకాశాలు వస్తున్నట్టు తెలుస్తుంది. ఫాం లో ఉన్నప్పుడు సినిమాలు రావడం కామనే కానీ వాటిల్లో హిట్ కథలను ఒడిసి పట్టుకోవడం గొప్ప విషయం. అందులో రష్మిక చాలా క్లవర్ అనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడు బాలీవుడ్ తో పాటు సౌత్ సినిమాలను కవర్ చేస్తుంది. తెలుగులో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తున్న రష్మిక హిందీలో సల్మాన్ ఖాన్ తో సికిందర్ చేస్తుంది. ఈ సినిమాతో పాటు ఛావా ఆల్రెడీ పూర్తి కావొచ్చింది. లేటెస్ట్ గా షాహిద్ కపూర్ తో కాక్ టెయిల్ లో కూడా రష్మిక ఫిక్స్ అయినట్టు తెలుస్తుంది. రష్మిక దూకుడు చూసి మిగతా హీరోయిన్స్ అంతా కుళ్లు కునేలా ఉన్నారు. ఐతే ఫాం లో ఉన్నా వచ్చిన ప్రతి సినిమా చేస్తున్నాం అన్నట్టు కాకుండా కథ, హీరోతో పాటు కాంబినేషన్స్ ని చూస్తుంది అమ్మడు. అందుకే అమ్మడి కెరీర్ అంత పర్ఫెక్ట్ ఫాం లో ఉందని ఉం చెప్పొచ్చు. నేషనల్ వైడ్ గా తన ఫ్యాన్స్ అందరినీ అలరించే సినిమాలతో ఎప్పటికప్పుడు కొత్త పాత్రలు కొత్త సినిమాలతో వస్తుంది రష్మిక. కమర్షియల్ సినిమాలే కాదు వెరైటీ సినిమాల విషయంలో కూడా రాజీపడేది లేదని అంటుంది రష్మిక. సో చూస్తుంటే నెక్స్ట్ ఇయర్ కూడా రష్మిక నామ సంవత్సరంగా మారేలా ఉందనిపిస్తుంది. నేషనల్ వైడ్ గా ప్రస్తుతం టాప్ హీరోయిన్ ఎవరు అంటే కచ్చితంగా అందరు రష్మిక పేరు చెప్పేస్తారు. ఇక వరుస ఛాన్సులు, హిట్లతో డిమాండ్ పెరగడంతో రెమ్యునరేషన్ కూడా పెంచే ఆలోచనలో ఉందట క్రష్మిక. అమ్మడి హిట్ ఫాం చూసిన ఎవరైనా సరే ఆమె అడిగినంత పారితోషికం ఇవ్వడంలో అసలు వెనక్కి తగ్గరని చెప్పొచ్చు.

# బోల్డ్ లుక్‌లో హీరో గారి భార్య

తెలుగు అమ్మాయి అయినా బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా కనిపించే ముద్దుగుమ్మ అదితి రావు హైదరి. రాజ కుటుంబంకు చెందిన ఈ అమ్మడు బాలీవుడ్, కోలీవుడ్‌లో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లోనూ ఈమె పలు సినిమాల్లో నటించింది. మలయాళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈమె ఆ తర్వాత తమిళ్ మూవీ చేసింది, హిందీలో వరుసగా సినిమాలు చేయడంతో పాటు మరాఠి మూవీలోనూ కనిపించింది. తెలుగులో మొదటి సారి సమ్మోహనం అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఇటీవల ఈమె ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్న విషయం మనం చూస్తూనే ఉన్నాం. శర్వానంద్ హీరోగా నటించిన మహా సముద్రం సినిమాలో అదితి రావు హైదరీ హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాలో మరో ముఖ్య పాత్రలో నటించిన సిద్దార్థ్ నటించాడు. సినిమా షూటింగ్ సమయంలోనే సిద్దార్థ్, అదితి మధ్య పరిచయం, స్నేహం, ప్రేమ ఏర్పడింది. ఇద్దరూ అప్పటి నుంచి ప్రేమలో మునిగి తేలారు. దాదాపు మూడు సంవత్సరాలు వీరి ప్రేమ గురించి మీడియాలో వార్తలు వస్తూనే ఉన్నాయి. ప్రేమ విషయాన్ని అధికారికంగా చెప్పకుండా అప్పుడప్పుడు కలిసి కార్యక్రమాలకు హాజరు కావడం వల్ల వీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయ్యారు. ఎట్టకేలకు వీరిద్దరు పెళ్లి చేసుకుని మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సౌత్ ముద్దుగుమ్మలు సినిమాలకు దూరం అవుతారు అనే టాక్ ఉంది. కానీ అదితి రావు మాత్రం మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఈసారి తన ఫిజిక్‌ను కాస్త బోల్డ్‌గా, బ్రా లేకుండా కోర్టు బటన్స్ విప్పి ప్రేక్షకులను కవ్విస్తూ సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేయడం ద్వారా నెటిజన్స్ చూపు తిప్పుకోలేక పోతున్నారు. ఈ ఫోటోలు పెళ్లి అయిన తర్వాత షేర్ చేయడం ద్వారా ఆమె ఏం మెసేజ్ ఇస్తుంది అంటూ కొందరు ప్రశ్నిస్తూ ఉంటే, కొందరు మాత్రం ఆమె తాను గతంలో ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉన్నాను అని చెప్పడం కోసం ఇలా చేసింది. ముందు ముందు ఆమె నుంచి మరిన్ని మంచి సినిమాలు వస్తాయి అని చెప్పడానికి ఈ ఫోటోలు సింబాలిక్‌గా ఉన్నాయి అంటూ ఆమె ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి నిన్న మొన్నటి వరకు పెళ్లి ఫోటోలతో వైరల్ అయిన అదితి రావు ఇప్పుడు అంతకు మించి అంటూ ఈ బోల్డ్ ఫోటోలతో వైరల్ అవుతోంది. హీరో గారి భార్య బోల్డ్ ఫోటో షూట్ అంటూ ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతున్నాయి.





# నిధి రాజాసాబ్ లీక్డ్ ఫోటో కాదు



ప్రభాస్ హీరోగా రూపొందుతున్న రాజాసాబ్ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. అయితే వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉన్న కారణంగా సినిమాను వాయిదా వేసే అవకాశాలు ఉన్నాయి. కొత్త విడుదల తేదీ విషయమై చర్చ జరుగుతోంది. త్వరలోనే సినిమా విడుదల తేదీ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో రాజాసాబ్ నుంచి లీక్డ్ ఫోటో అంటూ నిధి అగర్వాల్ ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ విషయం పై నిధి అగర్వాల్ స్వయంగా క్లారిటీ ఇస్తూ అది లీక్ ఫోటో కాదని చెప్పుకొచ్చింది. సోషల్ మీడియా ద్వారా నిధి అగర్వాల్ స్పందిస్తూ... రాజా సాబ్ సినిమాలోని తన ఫోటో అంటూ ఏదైతే పిక్ వైరల్ అవుతోందో అది ఆ సినిమాలోనిది కాదు, అది ఒక యాడ్ షూట్ సందర్భంగా తీసిన ఫోటో, దాన్ని కొందరు కావాలి అని రాజాసాబ్ సినిమా లీక్డ్ ఫోటో అంటూ ప్రచారం చేస్తున్నారు. రాజాసాబ్ కి సంబంధించిన ఫోటోలను త్వరలో మీ ముందుకు తీసుకు వస్తాం. తప్పకుండా ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే విధంగా రాజాసాబ్ ఉంటుంది, అప్పటి వరకు లీక్‌లను, పుకార్లను నమ్మవద్దు అంటూ ఆమె విజ్ఞప్తి చేస్తూ పోస్ట్ చేసింది. రాజాసాబ్‌లో నిధి అగర్వాల్ లుక్ ఇలా ఉంటుంది అంటూ ప్రచారం చేసిన వారు సైలెంట్ అయ్యారు. రాజాసాబ్ నుంచి త్వరలోనే నిధి అగర్వాల్ పోస్టర్‌ను మారుతి విడుదల చేస్తాడేమో చూడాలి. ఈ సినిమాలో నిధి అగర్వాల్‌తో పాటు ముద్దుగుమ్మ మాళవిక మోహనన్, రిద్ధి కుమార్‌లు నటిస్తున్నారు. ముగ్గురు ముద్దుగుమ్మలతో ప్రభాస్ చేయబోతున్న రొమాన్స్ ఎలా ఉంటుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు, ఈ హర్రర్ కామెడీ సినిమా ఓ రేంజ్‌లో వినోదాన్ని పంచడంతో పాటు రికార్డ్ స్థాయి వసూళ్లు సొంతం చేసుకుంటుంది అంటూ మేకర్స్ అంటున్నారు. సలార్, కల్కి సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సక్సెస్ దక్కించుకున్న ప్రభాస్ ఈ సినిమాతో రాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఇప్పటి వరకు చిన్న సినిమాలను రూపొందించిన దర్శకుడు మారుతి మొదటి సారి పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నాడు. వందల కోట్ల బడ్జెట్‌తో హాలీవుడ్ రేంజ్ హర్రర్ సీన్స్‌తో ఈ సినిమా ఉంటుంది అంటున్నారు. వచ్చే ఏడాది సమ్మర్ చివర్లో లేదా దసరా వరకు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందేమో చూడాలి.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296